# గొప్ప యోధులు
## (I & II సమూయేలు గ్రంథాల సంగ్రహ సమీక్ష)

**A. ఉపోద్ఘాతము :** హెబ్రీ చరిత్రకు ఆనవాలుగా ఉన్న సమూయేలు గ్రంథాలు న్యాయాధిపతుల సుదీర్ఘ పాలన కాలానికి ముగింపుగా, రాజ వంశ చరిత్రకు. ఈ భూమ్మీద మానవ పాలనకు ఆరంభంగా ఉన్నాయి.

**1. గ్రంథకర్త :** I సమూయేలు 1-25వ అధ్యాయం వరకు సమూయేలే వ్రాసాడన్న గుర్తింపు ఉంది. మిగతా అధ్యాయాలను మరియు II సమూయేలు గ్రంథాన్ని నాతాను మరియు గాదు వ్రాసియుండవచ్చును. (I ది.వృ. 29:29). ఈ రెండు గ్రంథాలలో మొదటి పాత్ర ధారి సమూయేలు గనుక ఈ గ్రంథాలకు అతని పేరు ఆపాదించబడింది, గాని అతడు ఈ గ్రంథాలను పూర్తిగా వ్రాయలేదు.

**2. వ్రాయబడిన సందర్భం :** న్యాయాధిపతుల కాలంలో ఇశ్రాయేలుకు రాజు లేదు. సార్వభౌముడైన దేవుడు, మనిషికి వ్యక్తిగతంగా రాజుగా ఉండాలన్న కోరికను మనిషి త్రోసివేసినందువలన కలిగిన పర్యవసానాలను ఈ గ్రంథాలలో చూస్తాము. దైవ పాలన స్థానంలో మానవ పాలనకు ప్రాధాన్యతనివ్వడం వలన వారిపైకి వచ్చిన తీర్పును చూస్తాము.

**3. గ్రంథ విశిష్టత :** ఈ రెండు గ్రంథాలు కూడ ఈనాడు ప్రపంచానికి ఏలాంటి పాలకులు అవసరమో తెలియజేస్తాయి. ఈనాడు ప్రపంచాన్ని ఏలేందుకు, తమ శక్తిని నీతిగా ఉపయోగించే రాజులు, శక్తి కొరకు దేవునిపై ఆధారపడే రాజులు మరియు తమకు దేవునిచే ఇవ్వబడిన శక్తిని బట్టి సమస్తం చేయగలమన్న విశ్వాసం గల పాలకులు కావాలి. అంత మాత్రమే కాదు దేవునికి సంపూర్ణంగా విధేయత చూపించగల అధినేతలు కావాలి. సమూయేలు గ్రంథాలు న్యాయాధిపతుల కాలము నుండి ఇశ్రాయేలు రాజ్య స్థాపన వరకు మనల్ని కొనసాగింపచేస్తాయి. ఈ రాజ్యం యొక్క ఛాయలు, రానున్న వెయ్యేండ్ల పాలనపై లక్ష్యముంచేందుకు దోహదపడతాయి. ప్రపంచ చరిత్రను గూర్చిన గంభీరమైన పాఠాలను నేర్పిస్తాయి.

సమూయేలు మొదటి గ్రంథం ప్రార్థనతో ప్రారంభించబడింది. సమూయేలు రెండవ గ్రంథం ప్రార్థనతో ముగించబడింది. ఈ గ్రంథంతోనే ప్రవక్తల పరిచర్య ప్రారంభమౌతుంది.

సమూయేలు గ్రంథాలు సుందరగాథను మాత్రమే కాదు. మారుతున్న కాలాన్ని పరిస్థితులను సూచిస్తున్నాయి. మానవ చరిత్రలో దేవుని జోక్యం, దైవాధికారము నుండి రాజు అధికారానికి మార్చబడింది. దేవుడు ప్రవక్తలకు నోరుగా ఉండి వారి ద్వారానే మాట్లాడాడు గాని, రాజుల ద్వారా ఎన్నడూ మాట్లాడలేదు.

మానవుల కోరిక మేరకు దేవుడు రాజులను నియమించాడు గాని, వాస్తవానికి అది దేవుని చిత్తంకాదు. ఆయన రాజులను నియమించినా, వారి నాయకత్వం ప్రవక్తలతో కలిసి



కొనసిగించబడింది. దేవుని ప్రణాళికకు, ఆయన పనికి ఆటంకం కలుగకుండ దేవుని వాక్యం ద్వారా, రాజును దేవుని చిత్తంలోకి నడిపించే బాధ్యత, హెచ్చరించే బాధ్యత ప్రవక్తకు అప్పగించబడింది. రాజుల విధేయతను బట్టే దేవుడు పనిచెయ్యగలిగాడు.

సమూయేలు, రాజులు, దినవృంతాలు మొదలైన చరిత్ర గ్రంథాలు, ప్రవక్తల గ్రంథాల, కావ్య గ్రంథాల చారిత్రాత్మక నేపథ్యాన్ని అర్థం చేసికోడానికి సహాయపడతాయి. (I సమూ 21:10; 22:2 ను కీర్తన 34తో II సమూ 11-18ని కీర్తన 32, 51తో పోల్చి చూడండి).

## B. గ్రంథ విభజన : I సమూయేలు గ్రంథం.

**I. సమూయేలు - దేవుని ప్రవక్త (1-8 అధ్యా) :**

**1. సమూయేలు జన్మ.**

అ) హన్నా ప్రార్థన మరియు జవాబు — 1 అధ్యా

ఆ) హన్నా ప్రవచనాత్మక ప్రార్థన - మందిరంలో బాలుడైన సమూయేలు — 2 అధ్యా

**2. సమూయేలు పిలుపు** — 3 అధ్యా

**3. చివరి న్యాయాధిపతి మరియు మొదటి ప్రవక్త.**

అ) సమూయేలుకు వచ్చిన దేవుని వాక్కు నెరవేరుట - మందసం, పట్టబడుట, ఏలీ, అతని కుమారులు చనిపోవుట — 4 అధ్యా

ఆ) మందసమును బట్టి దేవుడు ఫిలిష్తీయులకు తీర్పుతీర్చుట మందసం బెత్షెమెషుకు తీసికొనిరాబడుట — 5,6 అధ్యా

ఇ) ఇశ్రాయేలు ఉజ్జీవం - ఎబెనెజరు వద్ద విజయం — 7 అధ్యా

ఈ) ఇశ్రాయేలీయులు దేవుణ్ణి విసర్జించుట - రాజు కావాలని కోరుట — 8 అధ్యా

**II. సౌలు-సాతాను మనిషి (9-15 అధ్యా) :**

**1. సౌలు పొందినవి**

అ) సౌలు రాజుగా ఎన్నుకోబడుట — 9 అధ్యా

ఆ) సౌలు రాజుగా అభిషేకించబడుట — 10 అధ్యా

**2. సౌలు పరిపాలన**

అ) అమ్మోనీయులపై విజయం — 11 అధ్యా

ఆ) అధికారం సమూయేలు నుండి సౌలుకు బదిలీచేయబడుట — 12 అధ్యా

**3. సౌలు విసర్జింపబడుట**

అ) సౌలు దేవునికి వ్యతిరేకి అగుట — 13 అధ్యా

ఆ) ఫిలిష్తీయులను ఓడించుటలో యోనాతాను బాధ్యత-ఆ కీర్తిని సౌలు పొందుట — 14 అధ్యా

ఇ) అగగు విషయంలో సౌలు తిరుగుబాటుతనం, అవిధేయత — 15 అధ్యా

**III.దావీదు - దేవుని మనిషి (16-31 అధ్యా) :**

| | |
|---|---|
| **1. దావీదు అభిషేకము** | 16 అధ్యా |
| **2. దావీదు సిద్ధపర్చబడుట** | |
| అ) గొల్యాతును చంపుట | 17 అధ్యా |
| ఆ) దావీదు యోనాతానుల నిబంధన, సౌలు తన కుమార్తెయైన మీకాలును దావీదుకిచ్చుట | 18 అధ్యా |
| **3. దావీదు శిక్షణ పొందుట** | |
| అ) సౌలు దావీదును చంపుటకు ప్రయత్నించుట | 19 అధ్యా |
| ఆ) దావీదు యోనాతాను సహాయంతో తప్పించుకొనుట | 20 అధ్యా |
| ఇ) దావీదు నోబు, మరియు గాతునకు వెళ్ళుట | 21 అధ్యా |
| ఈ) దావీదు మనుష్యులను ప్రోగుచేసికొనుట - సౌలు దేవుని యాజకులను హతము చేయుట | 22 అధ్యా |
| ఉ) దావీదు ఫిలిష్తీయులతో పోరాడుట - యోనాతానుతో నిబంధన చేయుట | 23 అధ్యా |
| ఊ) దావీదు ఎన్గెదిలో సౌలును వదలిపెట్టుట | 24 అధ్యా |
| ఎ) సమూయేలు మరణం - దావీదు అబీగయేలు | 25 అధ్యా |
| ఏ) జీఫు అరణ్యంలో దావీదు సౌలు ప్రాణాన్ని కాపాడుట | 26 అధ్యా |
| ఐ) దావీదు సిక్లగుకు పారిపోవుట | 27 అధ్యా |
| ఒ) సౌలు ఎన్దోరులోని కర్ణపిశాచిగల స్త్రీ వద్దకు వెళ్ళుట | 28 అధ్యా |
| ఓ) యుద్ధములో దావీదుపై ఫిలిష్తీయుల అపనమ్మకం | 29 అధ్యా |
| ఔ) సిక్లగులోని నష్టాన్ని బట్టి దావీదు అమాలేకీయులతో యుద్ధం చేయుట | 30 అధ్యా |
| 4. సౌలు యుద్ధంలో గాయపడుట - ఆత్మహత్యకు ప్రయత్నించుట | 31 అధ్యా |

## C. అంశాల వారిగా సంక్షిప్త వివరణ :
ఈ గ్రంథంలోని ప్రధాన పాత్ర ధారులను బట్టి దీనిని 3 భాగాలుగా విభజించవచ్చును.

**I. సమూయేలు - దేవుని ప్రవక్త, యాజకుడు మరియు న్యాయాధిపతి (1-8 అధ్యా) :**

1. **సమర్పణగల తల్లి :** షిలోహులో హన్నా ప్రార్థనతో ఈ గ్రంథం ఆరంభమైంది. ప్రజలు రాజు కొరకు మొఱ్ఱ పెడుతూ ఉండగా ఒక దైవికమైన స్త్రీ దేవుని సేవ నిమిత్తం ఒక బిడ్డ కావాలని మొఱ్ఱపెట్టింది. ఒక స్త్రీ ప్రార్థన ఫలితంగా ఇశ్రాయేలీయులు చివరి న్యాయాధిపతిని పొందగలిగారు.

2. **సమూయేలు :** సమూయేలు ప్రార్థన ద్వారాపుట్టాడు, ప్రార్థనలో పెరిగాడు (3:1-9) ప్రార్థన ద్వారా ప్రజలకు విజయాన్ని సాధించాడు (7:5-10) ఇశ్రాయేలు జాతి తమకు రాజు కావాలని కోరినపుడు ప్రార్థించాడు (8:6) విజ్ఞాపన ప్రార్థనే అతని జీవిత ప్రధానాంశం (12:19-23).



3. **ప్రతికూల పరిస్థితులలో విరజిమ్మిన పరిమళం :** సమూయేలు షిలోహుమందిరంలో విడిచిపెట్టబడినప్పుడు అక్కడి యాజకత్వంలో అవినీతి ఉన్నా, సమూయేలు దేవుని భయంలో పెరిగాడు. (I సమూ 1:24-28; 2:12-26; 3:1-21) మనిషి తన దూరాశవల్లే పాపం చేస్తాడు గాని (యాకో 1:14) పరిస్థితులను బట్టి కాదని సమూయేలు తన జీవితంలో నిరూపించాడు. పరిస్థితులు ఎప్పుడూ మనిషిని పాపిగా మార్చవు గాని పరిస్థితులలో మనిషిలో ఉన్న పాపం బయటికి వస్తుంది.

ఏలీ ఇశ్రాయేలీయులకు 40 సంవత్సరాలు న్యాయాధిపతిగా, యాజకునిగా ఉన్నాడు అతడు దురాశ పరుడైన తండ్రిగా ఉన్నందువలన ఇద్దరు కుమారులు నిర్దయగా ప్రవర్తించారు. ఆనాటి నైతిక పతన స్థితికి వారు కారకులయ్యారు. వారిని బట్టి దేవుడు ఏలీని గద్దించాడు.

4. **దేవుని స్వరం వినుట :** సమూయేలు దేవుని స్వరాన్ని వినేందుకు సిద్ధంగా ఉన్నప్పుడే దేవుడతనితో మాట్లాడాడు. ఒక విశ్వాసి వాక్యం ద్వారా దేవుని స్వరాన్ని వినేందుకు హృదయాన్ని సిద్ధపరచుకొన్నప్పుడే దేవుడతనితో మాట్లాడతాడు. సమూయేలు సిద్ధమనస్కుడై దేవుని స్వరం విన్నందువల్ల. ఇశ్రాయేలీయులందరూ అతని ద్వారా దేవుని స్వరాన్ని విన్నారు. దేవుని వాక్కు అరుదుగా ఉన్న కాలంలో పుట్టిన సమూయేలు ద్వారా ప్రజలు దైవస్వరాన్ని విస్తృతంగా విన్నారు.

5. **సమూయేలు పిలుపు :** సమూయేలుకు దైవ పిలుపు వచ్చినప్పుడు అతని వయస్సు 12 సంవత్సరాలు ఉండవచ్చునని జోసీఫస్ అనే చరిత్రకారుడు చెప్పాడు (2:18). నేను బాలుడను అని సొలొమోను (I రాజు 3:7) యిర్మీయా (యిర్మీ 1:6) చెప్పినప్పుడు వారు బాలురుకారు. ఆలాగే సమూయేలు కూడ యుక్తవయస్సులో ఉన్నాడని అతని అభిప్రాయం. 3వ అధ్యాయంలో నాలుగు పిలుపులు ఉన్నాయి. మొదటి రెండు రక్షణ కొరకైన దేవుని పిలుపు (3:4-7) చివరి రెండు పిలుపులు పరిచర్య కొరకైనవి (3:10).

6. **ఇశ్రాయేలు దీర్ఘకాల పాపం - అపజయం :** ఇశ్రాయేలీయుల దీర్ఘకాల పాపం జాతి పతనానికి కారణమైంది. వారు సమూయేలును సంప్రదించకుండ ఫిలిష్తీయులపైకి యుద్ధానికి వెళ్ళారు. వీరు ఇశ్రాయేలుకు బలమైన శత్రువులు. ఇశ్రాయేలీయులు, ప్రారంభంలో వీరికి 40 సంవత్సరాలు దాసులుగా ఉన్నారు (న్యాయా 13:1) సమ్సోను మరణానంతరం తిరిగి దాడి చేసారు. ఇశ్రాయేలీయులు దేవునికి వ్యతిరేకంగా యుద్ధానికి పూనుకొన్నారు గనుక ఓటమి పాలయ్యారు. నేటి యుద్ధాలకు ప్రధాన కారణం దేవుని పట్ల తిరుగుబాటే. నవనాగరికత ఎప్పుడేగాని దేవుని చిత్తాన్ని వెదకదు ఆయన మహిమను కోరదు. కనుక దేవుడు వారిని విడచిపెడతాడు.

మన జీవితం కూడ ఓ నిరంతర పోరాటమే అయినా, దేవుని చిత్తాన్ని మన చిత్తంగా చేసికొంటే, మన రక్షకుని నాయకత్వంలో విజయవంతమైన పోరాటం సల్పగలం (రోమా 8:37).

7. **ప్రత్యామ్నాయం :** మొదటి సారి ఫిలిష్తీయుల చేతుల్లో ఓడిపోయిన ఇశ్రాయేలీయులు, తమ భద్రత కోసం మందసాన్ని యుద్ధభూమికి తీసికొని వెళ్ళారు. (4:3-7,10) అది దేవునికి ప్రత్యామ్నాయంగా ఏ మాత్రం సరిపోదు. దేవుని సన్నిధి తోడుగా లేనిదే విజయం అసాధ్యం. మతపర చిహ్నాలు లేక ఆచారాలు మనకు భద్రతనివ్వలేవు.

మానవుడు అవధులు దాటినప్పుడు దేవుడు దానిని అవకాశంగా తీసికొంటాడు. ఆ పరిస్థితిలో జరిగిన నష్టం ఎంత తీవ్రమైనదైనా, దేవుడు దానిని ఇశ్రాయేలీయులకు మేలుగా మార్చాడు. సమూయేలు ద్వారా ఫిలిష్తీయుల నుండి విడుదల నిచ్చాడు. రాజ్యం కొరకు సన్నాహాలు జరిగించాడు. శాశ్వతమైన ఆరాధనా స్థలాన్ని, మెరుగైన యాజకత్వాన్ని స్థాపించాడు.

8. **సమయానుకూలమైన ఉజ్జీవం :** గతంలో షిలోహులో దైవ ప్రత్యక్షత కొరవడింది. యెహోషువ కాలం నుండి దేవుని నివాస స్థానంగా ఉన్న షిలోహు, తిని త్రాగి నాట్యమాడే స్థలంగా మారింది. (న్యాయా 21:19-21). సమూయేలును బట్టి ఆ స్థలానికి తిరిగి ప్రాధాన్యత చేకూర్చబడింది. తిరిగి దైవ ప్రత్యక్షత ఆరంభమైంది. ఈ ఉజ్జీవానికి కారణం ప్రార్థనాపరులైన తల్లి (1 అధ్యా) శిక్షించబడిన ప్రజలు (2 అధ్యా) నమ్మకమైన ప్రవక్త (3 అధ్యా).

20 సంవత్సరాల అనంతరం ఇశ్రాయేలు ప్రజలు మందసాన్ని స్వీకరించుటకు, బయలు, అష్తారోతు దేవతలను విడిచి, నిజ దేవుణ్ణి సేవించుటకు మళ్ళుకొన్నారు (7:6). ఇశ్రాయేలీయుల ఫిలిష్తీయులపై విజయానికి సూచనగా సమూయేలు ఎబెనెజరులో ఒక రాయిని నిలిపాడు. 7:15-17 లో ప్రవక్తగా, యాజకునిగా, న్యాయాధిపతిగా సూచనగా సమూయేలు సేవ విస్తరించుటను గూర్చి వివరించబడింది.

7. **సమూయేలు మాదిరి :** దేవుడు తన బిడ్డలకు ఎప్పుడూ మంచిదే ఇస్తాడు. మనము ఆయన స్వేచ్ఛాయుత రాయబారులంగా, దేవుడిచ్చే శ్రేష్ఠమైన వాటిని గాని, లేక మన ఇష్టానుసారమైన వాటినిగాని ఎన్నుకోవచ్చును. మనం ఎన్నుకొన్నదానిని బట్టే పరిణామాలుంటాయి సుమా! సమూయేలు దైవ చిత్తాన్ని తన చిత్తంగా చేసికొని అనేకులకు మాదిరిగా నిలిచాడు. అతడు యాజకుడు, న్యాయాధిపతులలో చివరివాడు, ప్రవక్తలలో మొదటివాడు మరియు ఐక్యరాజ్య సంస్థాపకుడు. అతని జీవితంలో ఏ పొరపాటును కనుగొనలేము. ప్రవక్తల పాఠశాలల ప్రారంభికుడు కూడ సమూయేలే.

II **సౌలు ప్రజలచే ఏర్పరచుకొనబడిన రాజు :** దేవుడు ఇశ్రాయేలుకు తానే రాజైయుండాలని వారికి నాయకులను నియమించి, వారి ద్వారా తానిచ్చే ఆజ్ఞలను నెరవేర్చే ప్రజలుగా వారు ఉండాలని ఆశించాడు. కాని ఇశ్రాయేలీయులు తమ పొరుగు రాజ్యాలను చూసి, తమకు ఒక రాజు ఉండాలని సమూయేలుతో విన్నవించుకొన్నారు. (8:3-20; 9:16-20). దేవుడు వారి కోరికను కాదనలేదు. ఇక్కడ మనం ఓ ఆత్మీయ సత్యాన్ని నేర్చుకోవాలి. మనం దేవుడిచ్చే శ్రేష్ఠమైన దాన్నైనా ఎన్నుకోవాలి లేక దానికి బదులుగా ఆయనిచ్చే మరో



మంచిదాన్నైనా ఎన్నుకోవాలి. అంటే ఆయనచేస్వయంగా ఇవ్వబడినదాన్ని లేక ఆయనచే అనుమతించబడిన దాన్ని కోరుకోవాలి. మనం కోరినది అనుమతించబడినా అది మన ప్రాణాలకు క్షీణతను కలుగజేస్తుంది.

1. **సౌలు ఎన్నిక :** సౌలు మొదట రహస్యంగా (10:1) తరువాత బహిరంగముగా ఎన్నుకోబడ్డాడు (10:24). సౌలు చాల పొడుగైనవాడు. తగ్గింపు స్వభావంగలవాడు. సైన్యాధిపతిగా ఉండతగినవాడు. మొదట సౌలు తాను రాజుగా ఉండేందుకు అనర్హుణ్ణి అనుకొన్నాడు కాని అతని ఎంపిక నిశ్చయం చేయబడ్డాక అంగీకరించాడు (10:6; 11:8-15). యాబేష్గిలాదులో అతడు అమ్మోనీయులపై సాధించిన విజయాన్ని బట్టి ఇశ్రాయేలీయులచే రాజుగా అంగీకరించబడ్డాడు (11:15).

2. **సమూయేలు హెచ్చరిక :** సమూయేలు సౌలుకు పూర్తి అధికారాన్ని అప్పగించాడు. దేవుడు సౌలును ఇశ్రాయేలీయుల నిర్ణయం ప్రకారం రాజుగా అనుగ్రహించినప్పటికిని, ప్రజలు లోబడితే దేవుడు వారికి దీవించేందుకు సిద్ధంగా ఉన్నాడు. "కాబట్టి మీరు కోరి యేర్పరచుకొనిన రాజు ఇతడే. యెహోవా ఇతనిని మీమీద రాజుగా నిర్ణయించియున్నాడు. మీరు యెహోవాయందు భయభక్తులు కలిగి ఆయన మాటను విని, ఆయనను సేవించి, ఆయన ఆజ్ఞను భంగము చేయక మీరును, మిమ్మును ఏలు రాజును, మీ దేవుడైన యెహోవాను అనుసరించిన యెడల మీకు క్షేమము కలుగును" (12:13-14) ప్రజలు వారి తప్పును గ్రహించసాగారు (12:19). గిల్గాలు వద్ద అతని చివరి ప్రసంగాన్ని, హెచ్చరికను ఉరుములతో కూడిన వర్షం బలపర్చింది. 22వ వచనంలో అద్భుతమైన దేవుని కృప ప్రత్యక్షతను మనం చూడగలము. "యెహోవా మిమ్మును తనకు జనముగా చేసికొనుటకు ఇష్టము కలిగియున్నాడు; తన ఘనమైన నామము నిమిత్తము తన జనులను ఆయన విడనాడడు."

3. **సౌలు తృణీకరించబడుట (13:1-15:9) :** ప్రారంభంలో సౌలు వినయంగానే ఉన్నా క్రమేణ అతనిలో గర్వం చోటు చేసికోవడం వలన దేవునికి అవిధేయుడయ్యాడు. సౌలుకివ్వబడిన గొప్ప ఆధిక్యత మరియు అవకాశాలు మరెవ్వరికీ ఇవ్వబడలేదు. అయినా అతడు పొందిన ఘోరాపజయం మరెవ్వరూ పొందలేదు. అందుకు కారణాలు ఇవి.

అ) యాజకుడు చెయ్యాల్సిన పనిని తాను చేయుట (13:9).
ఆ) తన కుమారుడైన యోనాతాను పట్ల కఠినత్వం (14:44,45).
ఇ) అయాలేకీయుల విషయం అవిధేయత (15:23).
ఈ) దావీదు పట్ల అసూయ, ద్వేషం (18:29).
ఉ) ఎన్దోరులోని కర్ణపిశాచిగల దానిని ఆశ్రయించుట వలన చేసిన పాపం (28:7).

సౌలు తృణీకరించబడేందుకు ఒకే ఒక కారణం ఏమంటే, అతడు దేవుణ్ణి తృణీకరించాడు. అతడు వీటన్నిటిని చేయడానికి కారణం ఒక్కటే. దేవుడు ఎప్పుడూ ప్రేమ విషయంలో

మొదటి స్థానాన్ని తీసికొంటాడు. (I యోహా 4:19) కాని మనిషి మాత్రం పాపం విషయం మొదటి స్థానం తీసికొంటాడు. (I సమూ 15:23). దేవునికి విధేయత చూపించడం ఎంత ముఖ్యమో ఇక్కడ వివరించబడింది. “అందుకు సమూయేలు – తాను సెలవిచ్చిన ఆజ్ఞను ఒకడు గైకొనుటవలన యెహోవా సంతోషించునట్లు. ఒకడు దహన బలులను అర్పించుటవలన ఆయన సంతోషించునా? ఆలోచించుము, బలులు అర్పించుట కంటె ఆజ్ఞను గైకొనుటయు, పొట్టేళ్ళ క్రొవ్వు అర్పించుట కంటె మాట వినుటయు శ్రేష్ఠము”. (15:22,23). సమూయేలు సౌలుతో కలిసిన చివరి సందర్భం ఇదే. అయినా సౌలు కొరకు అతడు బాధపడుతూనే ఉన్నాడు (15:35).

సౌలు అవిధేయతను బట్టి దేవుడు అతణ్ణి ఎడబాసాడు (28:6,15). పరలోకం మౌనం వహించినప్పుడు సౌలు పాతాళం వైపుమళ్ళాడు. కర్ణపిశాచి సమూయేలు ఆత్మను పిలవడం, అతడు సౌలు మరణాన్ని గూర్చి ప్రవచించడం వివాదాస్పదమైన విషయాలు.

సమూయేలును చూసిన కర్ణపిశాచిగల స్త్రీ వేసిన కేకను బట్టి వాస్తవంగా ఆమె అతణ్ణి పిలవలేదని అర్థమౌతుంది. విశ్రాంతిలో ఉన్న ఆత్మల్ని పిలిచే శక్తి ఆమెకు లేదు. దేవుడు అనుమతించినందు వల్ల ఆమె ధ్యానంలోనికి వెళ్ళి తెలసికొని ఉండవచ్చు. లేదా దేవుడు సమూయేలునే పంపించి ఉండవచ్చును. ఇది ఆమె ఊహించని సంఘటన. సౌలు కూడ అతణ్ణి గుర్తించాడు గనుక వంగి నమస్కరించాడు. మరణానంతరం కనిపించిన మరి ఇద్దరు వ్యక్తులు మోషే, ఏలియా. అయితే వారు మహిమలో కనిపించారు (మత్త 17:3; లూకా 9:30, 31). కాని సమూయేలు తాను భూమ్మీద ధరించిన దుప్పటితో సహాకనిపించాడు. కనుక అది ఓ ప్రత్యేక సంఘటన అని చెప్పవచ్చును.

సౌలు అవిధేయతను బట్టి దేవునికి కలిగిన అయిష్టతను బట్టి ఈ సంఘటన అనుమతించబడింది. ఈ సంఘటనను గూర్చి రాబర్ట్ జేనిసన్ అనే రచయిత మూడు కారణాలను చెప్పాడు.

అ) సౌలు చేసిన ఈ నేరం అతని శిక్షకు సాధనంగా చేయబడింది.

ఆ) అన్యజనాంగానికి దేవుని ప్రవచనం శ్రేష్ఠతను తెలియజేయడానికి ఈ సంఘటనను అనుమతించాడు.

ఇ) మానవుల మరణాంతర స్థితిని గూర్చి స్థిరపర్చడానికి దేవుడు సమూయేలు మాట్లాడేందుకు అనుమతించాడు.

సౌలు మొదటి పతనానంతరం మరో అవకాశం ఇవ్వబడినా అతడు విఫలుడయ్యాడు. ఫిలిష్తీయులతో జరిగిన యుద్ధంలో అతడు మరియు అతని ముగ్గురు కుమారులు హతమయ్యారు. గొప్ప వాగ్దానాలతో కూడిన అతని జీవితం అపజయంపాలైంది. అతని జీవితంలో సాతానుకు చోటిచ్చినందువల్ల వాని అధికారానికే లోబడాల్సి వచ్చింది. అదే సౌలు అసలు సమస్య. అతడు దేవునికి బదులు, తనను మొదటి స్థానంలో ఉంచుకొన్నాడు.



సౌలు దేవుని స్వాస్థ్యాన్ని, సొత్తును ఏలుటలో విఫలుడయ్యాడు. దేవుణ్ణి దేవుని అధికారాన్ని తృణీకరించాడు. అది అంతంలో అతని స్వయం నాశనానికే కారణమైంది. ఏ అమాలేకీయులనైతే సౌలు మినహాయించాడో ఆ అమాలేకీయుల చేతిలోనే చంపబడ్డాడు. దేవుణ్ణి తృణీకరించే వారి అంతం ఆలాగే ఉంటుంది.

III. **రాజుగా నిరూపించబడిన దావీదు :** సమూయేలు మొదటి గ్రంథం మూడవ భాగం సమూయేలు రోదనతో ప్రారంభమైంది. సౌలుకు బదులుగా దావీదును అభిషేకించడానికి అతడు బేత్లెహేముకు పంపించబడ్డాడు (16:1) ఈ భాగంలో మనం దావీదును గొఱ్ఱెల కాపరిగా (16:1–3) గాయకునిగా (16:14–23) సైనికునిగా (17 అధ్యా). రాజు అల్లునిగా, కీర్తనాకురునిగా, చూస్తాము. అతడు మూడు పర్యాయాలు అభిషేకించబడ్డాడు. ఇతడు రాజులకు రాజైన యేసు రాజు వంశావళి ప్రారంభికునిగా ఉన్నాడు. దావీదును అభిషేకించిన సందర్భంలో దేవుడు సమూయేలుకు ఓ గొప్ప సత్యాన్ని తెలియజేసాడు. “మనుష్యులు పైరూపమును లక్ష్యపెట్టుదురు. గాని యెహోవా హృదయమును లక్ష్యపెట్టును.” (16:7) దేవుడు తన కొరకు మనుష్యులను ఏర్పరచుకోవడానికి ఈ పద్ధతినే ఉపయోగిస్తాడు. 17వ అధ్యాయంలో దావీదు గొల్యాతుల ఉదాంతం, తెలియనిరంటూ ఉండరు. దావీదు గొల్యాతును చంపడానికి 5 రాళ్ళను ఎందుకు ఏరుకున్నాడు (17:40)? ఒక వేళ గురి తప్పుతుందేమోననా? కాదు సుమా? గొల్యాతుకు నలుగురు కుమారులున్నారు గనుక ఒక వేళ వారు కూడ ఎదురుగా వస్తే చంపాలనుకొన్నాడు. వారిని కూడ గురిగా పెట్టుకున్నారు. వారు అప్పుడు రాలేదుగాని, తరువాత దావీదు ద్వారా అతని సేవకుల ద్వారా హతమయ్యారు (II సమూ 21:22).

ఇక్కడ మనం ఓ ఆత్మీయ సత్యాన్ని నేర్చుకోవాలి. మన శత్రువైన సాతాను ఎప్పుడు ఏ విధంగా మనపై దాడి చేస్తాడో తెలియదు. గనుక ప్రస్తుతం మన ముందున్న దాడిని గుర్తించి వాణ్ణి జయించడమే కాక, భవిష్యత్తులో ఏ విధంగా దాడి చేస్తాడోనన్న అప్రమత్తతో, సిద్ధంగా ఉండాలి. వాడు ఎప్పుడు, ఎలా దాడి చేసి జయించగలిగినన్ని ఆయుధాలతో మనం సిద్ధంగా ఉండాలి.

రూతు బోయజుల మునిమనుమడైన దావీదు యెష్షయి చివరి కుమారుడు. అతడు అభిషేకించబడినప్పుడు 18 సంవత్సరాల వయస్సుగలవాడు. సితారా వాయించే నైపుణ్యత అతన్ని రాజమందిరానికి నడిపించింది. యోనాతానుతో అతనికి ఏర్పడిన స్నేహబంధం మధురమైనది. దావీదు గొప్ప విజయం సౌలు అసూయకు కారణమైంది. అతడు దావీదును చంపేందుకు నాలుగు సార్లు ప్రయత్నించాడు (19:10,15,20,21,23,24). కాని దేవుడు అతన్ని భద్రపర్చాడు. దావీదు జనులందరి దృష్టికి, సౌలు సేవకులు దృష్టికి అనుకూలుడై యున్నాడు (18:5). అతడు అన్ని విషయాలలో సుబుద్ధి కలిగి ప్రవర్తించాడు. దాన్ని బట్టి సౌలు మరెక్కువగా భయపడ్డాడు. ఎందుచేతనంటే, దేవుడు తనను విడిచిపెట్టి దావీదుకు

తోడైయున్నాడని సౌలు తెలిసికొన్నాడు (18:12-15).

సింహాసనం కొరకు అతణ్ణి సిద్ధపరచేందుకే ఈ పరిస్థితులు అనుమతించబడ్డాయి. దావీదు అలాంటి పరిస్థితుల్లో కూడ దేవునిపై నమ్మకముంచాడు. దేవుని సమయం కొరకు వేచియున్నాడు. అతడు ఏ తప్పు చేయలేదు గాని సౌలు అసూయ బట్టి తరుమబడ్డాడు. రెండు సార్లు సౌలు అతని చేతికి చిక్కినా దేవునిచే అభిషేకించబడినవానిని చంపనని దావీదు వదలివేసాడు. కాని సౌలు మాత్రం దావీదు దేవునిచే ఎన్నుకోబడిన రాజు అని తెలిసినా అతన్ని హతమార్చేందుకు వెదకుతూనే ఉన్నాడు (26:25). అతడు ఏదో ఒక దినానా సౌలు చేతిలో చంపబడతాడన్న భయంతో ఫిలిష్తీయుల నాశ్రయించాడు. అక్కడ ఉన్నప్పుడే అతడు 56వ కీర్తనను వ్రాసాడు.

తమ స్వంత మార్గాలను అనుసరించాలనుకొన్న వారికి సౌలు ఓ హెచ్చరికగా ఉన్నాడు. దేవుని పిల్లల జీవితంలో జరిగే ప్రతి విషయం, వారిని భవిష్యత్తు పరిచర్యకోసం సిద్ధపరచేందుకు అనుమతించబడుతుంది అని దావీదు జీవితం నిరూపిస్తుంది.

## D. గ్రంథ విభజన II సమూయేలు :

### I. దావీదు విజయాలు (1-10 అధ్యా) :

1. సౌలు మరియు యోనాతాను మరణాలను గూర్చి దావీదు దుఃఖంచుట 1 అధ్యా.
2. దావీదు యూదాపై రాజుగా చేయబడుట 2 అధ్యా.
3. అంతర్యుద్ధం - అబ్నేరు దావీదుతో చేరుట - యోవాబుచే చంపబడుట 3 అధ్యా.
4. సౌలు కుమారుడైన ఇష్బోషెతు చంపబడుట 4 అధ్యా.
5. దావీదు ఇశ్రాయేలు రాజ్యమంతటికి రాజుగా చేయబడుట - యెరూషలేమును రాజధానిగా చేసికొనుట 5 అధ్యా
6. మందసమును యెరూషలేముకు తీసికొనవచ్చుటలో దావీదు చేసిన తప్పులు, ఒప్పులు. 6 అధ్యా
7. దావీదు కుటుంబాన్ని స్థిరపరచుటలో దేవుని నిబంధన 7 అధ్యా
8. దావీదు తన రాజ్యాన్ని విస్తృత పరచుకొనుట 8 అధ్యా
9. దావీదు మెఫీబోషెతును పోషించుట 9 అధ్యా
10. దావీదు అమ్మోను మరియు సిరియాకు వ్యతిరేకంగా యుద్ధం చేయుట 10 అధ్యా

### II. దావీదు ఇబ్బందులు (11-24 అధ్యా) :

1. దావీదు రెండు గొప్ప పాపాలు 11 అధ్యా
2. అతని పాపాన్ని నాతాను ఖండించుట - దావీదు పశ్చాత్తాపం 12 అధ్యా
3. తామారు మానభంగం - అబ్షాలోము అమ్నోనును చంపుట 13 అధ్యా
4. దావీదు అర్ధమనస్సుతో అబ్షాలోమును క్షమించి తిరిగి రావడానికి అనుమతించుట 14 అధ్యా



5. అబ్షాలోము దావీదుపై తిరుగుబాటు చేయుట 15 అధ్యా
6. మెఫీబోషెతు సేవకుడైన సీబా దావీదును మోసగించుట, షిమీ దావీదును శపించుట 16 అధ్యా
7. దావీదును గూర్చి అహీతోపెలు అబ్షాలోముకు చెప్పిన ఆలోచనను హూషై భంగపర్చుట 17 అధ్యా
8. అబ్షాలోము మరణం - దావీదు దుఃఖించుట 18 అధ్యా
9. దావీదు తిరిగి సింహాసనాన్ని అధిష్ఠించుట 19 అధ్యా
10. దావీదుపై షెబ తిరుగుబాటు 20 అధ్యా
11. దేశంలో మూడు సంవత్సరాల క్షామము - గిబియోనీయులు సౌలు ఇంటివారి మీద పగతీర్చుకొనుట - ఫిలిష్తీయులతో యుద్ధం 21 అధ్యా
12. దావీదు విమోచన గీతము (కీర్త 18) 22 అధ్యా
13. దావీదు చివరి మాటలు మరియు దావీదు బలాఢ్యులు 23 అధ్యా
14. దావీదు జనసంఖ్యను లెక్కించుట-దేవుని తీర్పును ఎన్నుకొనుట 24 అధ్యా

**E. అంశాల వారిగా సంక్షిప్త వివరణ :** సమూయేలు 2వ గ్రంథమంతా దావీదును గూర్చే వ్రాయబడింది. ఈ గ్రంథం యేసుక్రీస్తును మన రాజుగా ప్రత్యక్షపరుస్తుంది. మనం క్రీస్తును మన జీవిత రాజుగా చేసికోవడం మాత్రమే కాక, ఆయనకివ్వాల్సిన సింహాసనాన్ని ఇవ్వాలి. సమూయేలు మొదటి గ్రంథం, మనిషి ఏర్పరచుకొన్న రాజు వైఫల్యాన్ని, రెండవ గ్రంథం దేవునిచే ఏర్పరచబడిన రాజు సింహాసనాన్ని అధిష్టించుటను గూర్చి తెలియజేస్తాయి. ఈ గ్రంథంలో దావీదు వంశం రాబోయే మెస్సీయా కొరకు స్థిరపరచబడింది. యేసు క్రీస్తు తిరిగి వచ్చినప్పుడు దావీదు సింహాసనంపై కూర్చుంటాడు. (యెష 9:7; లూకా 1:32). ఈ గ్రంథాన్ని ఓ జీవిత గాథగా పఠిస్తే అందలి అంశాలను సులభంగా జ్ఞాపకం ఉంచుకోవచ్చును. ఈ గ్రంథాన్ని రెండు ముఖ్యమైన భాగాలుగా విభజించవచ్చును.

**I. దావీదు యూదాపై రాజుగా చేయబడుట (1-4 అధ్యా) :** దేవునిచే అభిషేకించబడిన జీవితం యొక్క ధన్యత, ఆశీర్వాదకరమైన స్థితిని గమనించండి. అట్టి జీవితానికి ఆశ్రయం కల్పించబడుతుంది (5:22) పోషించబడుతుంది (5:2; కీర్త 23:1,2) అది విజయవంతమైన జీవితంగా ఉంటుంది (5:2) నన్ను వెంబడించండి అన్న యేసును వెంబడిస్తే ఆశ్రయం, పోషణ, విజయం లభిస్తాయి. యూదాపై రాజుగా చేయబడి, హెబ్రోనును రాజధానిగా చేసికొని 7 సంవత్సరాలు పరిపాలించాడు.

**II. దావీదు ఇశ్రాయేలుపై రాజుగా నియమించబడుట (5:1-5 అధ్యా) :** దావీదు యూదా మరియు ఇశ్రాయేలును 33 సంవత్సరాలు పరిపాలించాడు. దావీదు మొత్తం 40 సంవత్సరాలు రాజుగా ఉన్నాడు (I రాజు 2:10,11) అతడు మంచిరాజుగా పేరు

పొందాడు. (II సమూ 5:10-12) దావీదు పాలన నెమ్మదిగా నిరుత్సాహంగా ఆరంభమైంది. కాని దావీదు దేవునిపై విశ్వాసముంచాడు. దేవుని నడిపింపు కొరకు కనిపెట్టాడు. అతడు దేవుని యెదుట, మనుష్యుల ఎదుట తగ్గింపు గలవాడు. తన విజయాలలో సహితం తగ్గించుకున్నాడు. దేవుడు తనకిచ్చిన ప్రతి తలాంతును దేవుని మహిమార్థం వినియోగించాడు. దేవుడు కోరిన రీతిగా ప్రజల్ని నడిపించాడు. ఇశ్రాయేలు సరిహద్దులను మధ్యధరా సముద్రం నుండి యూఫ్రటిస్ వరకు విస్తరింప జేసి మహిమాన్విత స్థాయికి తీసికొని వెళ్ళాడు.

దావీదు రాజ్య పాలనలోని గొప్ప ఫలితం ఏమంటే, ఇశ్రాయేలు జాతి అంతా ఐక్యతతో అతని నాయకత్వానికి లోబడింది. ఐక్య ప్రజలను ఈ యౌవన నాయకుడు దేవునితో ఐక్యపర్చాడు.

అతడు పరిపాలనకు వచ్చాక మొదట యెరూషలేమును జయించి రాజధానిగా చేసికొన్నాడు. తరువాత దేవుని మందసాన్ని తీసికొనిరావాలని ప్రయత్నించాడు. మొదట అతని ప్రయత్నానికి ఆటంకాలు ఏర్పడినా తరువాత దానిని ప్రత్యక్షగుడారములోనికి చేర్చగలిగాడు. (II సమూ 6 అధ్యా).

**III.దావీదు శాశ్వత ఆధ్యాత్మిక రాజ్యం :** అతని రాజ్యాన్ని సుందరంగా మలచే ప్రయత్నంలో దావీదు తానున్న రాజ భవనాన్ని దేవుని ప్రత్యక్షగుడారంతో పోల్చి చూసినప్పుడు యెహోవా కొరకు మందిరాన్ని నిర్మించాలని ప్రేరేపించబడినా, ఈ విషయంలో కూడ దేవుని చిత్తానికే లోబడ్డాడు. నాతాను ద్వారా దేవుడు చెప్పిన మాటల్ని గమనించండి (7:4-17). నిజమైన దేవుని సేవకులు, తమ ప్రణాళికలను దేవుడు రద్దు చేసినప్పుడు అపార్థం చేసికోరు కాని, తమ యజమాని చిత్తానికే తల ఒగ్గుతారు.

దావీదు దేవుని ఇల్లు నిర్మించాలని కోరాడు (7:1-3) కాని దేవుడు దావీదు ఇంటిని నిర్మించాలని కోరాడు (7:4-29) దావీదుతో దేవుడు చేసిన నిబంధనగల ఈ అధ్యాయం బైబిల్లోనే గొప్ప అధ్యాయం. ఒక రోజు ఆయన రాజ్యము దావీదు వరుసలోనే రానున్నదని దేవుడు వాగ్దానం చేసాడు. (7:12,13,16). 14వ వచనం సొలొమోనును మాత్రమే కాదు, క్రీస్తును కూడ సూచిస్తున్నది.

పాత నిబంధన ప్రవక్తలు రాజ్యం విషయంలో ఈ వాగ్దానంపైనే ఆధారపడ్డారు. (యిర్మీ 23:5). క్రొత్త నిబంధన ఈ భాగమునుండే తెరవబడింది. (మత్త 1:1) మరియకు గబ్రియేలు దూత ఇచ్చిన సందేశం కూడ ఇదే (లూకా 1:32,33) పెంతెకొస్తు దినాన పేతురు ప్రసంగం (అపొ 2:25-31,34,35) రోమా పత్రికలో పౌలు వ్రాతలు (రోమా 1:3) ఈ భాగం నుండే ఆరంభించబడ్డాయి. క్రొత్త నిబంధన ఇక్కడే ముగించబడింది. (ప్రక 22:16). క్రొత్త నిబంధనలో దావీదును గూర్చి 59 సార్లు ప్రస్తావించబడింది.



**IV. దావీదు (పాపం) పతనం (11-20 అధ్యా) :** చాలసార్లు మనం, ఈ అధ్యాయాలకు ముందే దావీదు జీవితం ముగించబడితే బాగుండేది అనుకొంటాము. అతని పతనం అతని ఆధ్యాత్మిక జీవితాన్ని కమ్మిన ఓ సూర్యగ్రహణం లాంటిది. అది అతని జీవితంలో ఓ చెరగని మచ్చ.

దావీదులాంటి గొప్ప వ్యక్తి పాపంలో పడిపోడానికి ప్రధాన కారణం కీర్తన 51:5,6లో మనకు తెలుస్తుంది. అతడు పాపం చేసేందుకు దారితీసిన కారణాలేమి? మొదటి కారణం అతని సోమరితనం (11:1,2) రెండవదిగా అతడు బెత్షెబను చూసాడు. ఆమెను గూర్చి విచారణ చేసాడు (11:3) ఆమెను పిలిపించుకొన్నాడు (11:4) తరువాత ఊరియా పట్ల వ్యవహరించిన తీరు మరింత ఘోరమైనది. అతన్ని చంపించుటలో యోవాబును పాలిభాగస్తుని చేసాడు. దేశాధిపతే దీన్ని చేసాడు గనుక అది ఘోరపాపం.

అ) దావీదు పాపం గూర్చి మనం నేర్చుకోదగిన ఆత్మీయ సత్యాలు ఏంటి? దావీదు ఒక మనిషి, ఏ మనిషైగాని శోధనకు అతీతుడుకాదు.

ఆ) దావీదు ఆ సమయంలో దేవుని చిత్తంలోలేడు. తాను కోరిన దాన్ని పొందాలన్న దృక్పథంతోనే ఉన్నాడు.

ఇ) అతడు చేసిన హత్య ఘోరమైంది. దేవుణ్ణి, దేవుని ప్రజలను మరియు ఊరియా నమ్మకత్వానికి మోసం చేసాడు. బెత్షెబ తన భర్తకు ద్రోహం చేసేలా ఆమెకు మోసం చేసాడు. కాని కీర్తన 51:4లో దేవునికి విరోధంగా పాపము చేసానని ఒప్పుకొన్నాడు. అంటే మనుషులకు వ్యతిరేకంగా పాపం చేస్తే దేవుని వ్యతిరేకంగా చేసినట్లే. (మత్తయి 25:40).

ఈ) ప్రతి పాపానికి పరిణామాన్ని అనుభవించాల్సి ఉంటుంది. దావీదు పాప పరిణామాలు II సమూయేలు 12వ అధ్యాయ నుండి 18వ అధ్యాయం వరకు పేర్కొనబడ్డాయి.

ఉ) దావీదు తన పాపమును గూర్చి పశ్చాత్తాపపడి ఒప్పుకొన్నందుకు తిరిగి విజయవంతమైన జీవితాన్ని కొనసాగించాడు (కీర్త 32, 51).

ఊ) పాపమునకు వర్తమాన, భూత, భవిష్యత్ శిక్ష ఉంటుంది. కాని క్రీస్తు మన పాపాలన్నిటికి పరిహారాన్ని చెల్లించాడు. పాపం ఎంతటి వారినైనా పడవేస్తుంది. కాని పరిశుద్ధాత్మ శక్తి పాపము యొక్క శక్తిని జయిస్తుంది (I యోహా 4:4). పాపం మానవ సంబంధాలలో మచ్చను మిగిలిస్తుంది. యేసు రక్తం దాన్నంతా తుడిచివేసి, ఎన్నడూ పాపము చేయని వారిగా, నీతిమంతులుగా తీరుస్తుంది.

దేవుడు మనల్ని పరిశుద్ధులుగా ఉండేందుకు పిలిచాడు. రక్షణ అన్నది దేవుని వైపు నుండి ఆయనతో మన సంబంధంలోని సమస్యను పరిష్కరిస్తుంది, గాని మానవ సంబంధాలలో పాపం విషయం ఎదురయ్యే సమస్యను గూర్చి మనమే పరిష్కరించుకోవాలి. పాపాన్ని ఒప్పుకొని విడచిపెట్టాలి (సామె 28:13). ఇక పాపము చేయను అని తీర్మానం చేసికోవాలి (I యోహా 2:1; యోహా 8:10,11).

**V. దావీదు జీవిత చరమాంక దశ (20-24 అధ్యా) :** దావీదుపై జరిగిన తిరుగుబాటు అణచివేయబడిన తరువాత తన రాజ్యానికి వచ్చాడు. నూతన అధికార వర్గం ఏర్పాటు చేయబడింది. అన్ని రంగాలలో రాజ్యం పునర్నిర్మించబడింది. బలపర్చబడింది.

దావీదులో పొరపాట్లున్నాయి. కాని అతడు తన జాతిని విగ్రహారాధనవైపు తిరుగకుండ చేసాడు. అతడు స్థాపించిన రాజ్యం, చెరకు వెళ్ళేంత వరకు అనగా 450 సంవత్సరాల వరకు నిలిచి ఉండినది. దక్షిణ ఆసియాలోనే ఇశ్రాయేలును ఒక బలమైన రాజ్యంగా నిర్మించాడు. అతడు దేవుని ఇష్టానుసారుడని పిలువబడ్డాడు.

అతడు దేవుని మందిర నిర్మాణం కొరకు విస్తారమైన వస్తువులను, నిధులను సేకరించాడు. చివరిగా, జనసంఖ్యను లెక్కించే విషయంలో దావీదు చేసిన పొరపాటును గూర్చి వ్రాయబడింది. అతడు జనసంఖ్యపై ఆధారపడే బదులు దేవునిపై ఆధారపడాలి. (I ది.వృ. 21:1-7). దేవుడు మరలా దావీదును శిక్షించాడు. కాని తన శిక్షను తానే ఎన్నుకొనేందుకు అనుమతించాడు. దావీదు, తనను తాను దేవుని దయకు అప్పగించుకొన్నాడు (24:14). దేవుడు తెగులును పంపించాడు. తనకు దేవుని దూత కనిపించిన చోట బలిపీఠాన్ని నిర్మించేందుకు దావీదు అరౌనా కళ్ళమును కొన్నాడు (24:18-25).

తరువాత అదే స్థలంలో సొలొమోను మందిరాన్ని నిర్మించాడు. ఆ పవిత్ర స్థానంలోనే ప్రస్తుతం ఓమర్ మసీదు కట్టబడింది. ఇశ్రాయేలీయులు దానిని తిరిగి తమ అదుపులోనికి తీసికొనే సమయం రాబోతున్నది. ఈలోక ప్రభుత్వాలన్నీ మానవుల చేతిలో ఓటమిని సూచిస్తున్నాయి. చివరికి ప్రభుత్వాన్నీ ఒకే రాజ్యంగా, దాని స్వాస్థ్యకర్తకే అప్పగించబడతాయి. ఆయన దానిని నీతిని బట్టి పరిపాలిస్తాడు. (యెహె 21:27; యెష 32:1).

మనిషి శక్తిని గూర్చిన గొప్పతనం అతని సమర్పణ ద్వారానే లెక్కించబడుతుంది. మనం ఎవరు, ఏమైయున్నాయనే దానిపైన కాదుగాని, మనం దేవుని ఆధీనంలో ఉన్నామా లేదా అనే దానిని బట్టి మన జీవిత విజయం ఆధారపడి ఉంటుంది. అందుకు దావీదు జీవితం సాదృశ్యంగా ఉంది. అతడు గొప్పరాజు, గొప్ప సైనికుడు. అబ్రాహాము, మోషే మరియు పౌలువంటి భక్తుల శ్రేణిలో దావీదు ఉన్నాడు. దావీదు జీవితం మరియు అతని కాలము చరిత్రలో ప్రాముఖ్యమైనది. అతడు క్రీస్తు వంశావళి స్థాపకుడు (మత్త 1:1) అతడు అబ్రాహాముకు క్రీస్తుకు మధ్యనున్నాడు. అందును బట్టే క్రీస్తు దావీదు కుమారుడని పిలువబడ్డాడు. (అపొ 13:22,23). కీర్తనల గ్రంథాన్ని మనం అర్థం చేసికోవాలంటే దావీదు జీవితాన్ని క్షుణ్ణంగా అర్థం చేసికోవాలి. అందుకే సమూయేలు గ్రంథాలు అంత ప్రాధాన్యతను సంతరించుకొన్నాయి.



# గొప్ప పాలకులు

## (I & II రాజులు గ్రంథాల సంగ్రహ సమీక్ష)

**A. ఉపోద్ఘాతము :** రాజుల గ్రంథాలు దేవుని రాజ్యాన్ని మానవులు పాలించుటను గూర్చి తెలిపే పుస్తకాలు భూమిపై సింహాసనం ద్వారా ప్రజలకు దీవెనలు రావాలంటే ఆ సింహాసనం తప్పక పరలోక సింహాసనంతో శృతి కలిగియుండాలి. ఏది ఏమైనప్పటికి మనిషి పథకాల దేవుని ఉద్దేశాలను పడద్రోయలేవని రాజులు గ్రంథాలు తెలియజేస్తున్నాయి.

**1. గ్రంథకర్త :** యూదుల సాంప్రదాయం ప్రకారం రాజుల రెండు గ్రంథాలను యిర్మీయా ప్రవక్త వ్రాసాడని తెలుస్తుంది. ఆధునిక పండితులు కూడ ఇవి ఒక ప్రవక్త ద్వారా వ్రాయబడ్డాయని ఆమోదించారు.

**2. వ్రాయబడిన కాలము :** ఈ గ్రంథాలు వ్రాయబడిన కాలం ఖచ్చితంగా తెలియకున్నా, మొదటి దేవాలయం నిలిచి ఉన్న కాలంలోనే వ్రాయబడిందని చెప్పేందుకు ఆధారాలున్నాయి. క్రీ. పూ. 931 సం॥ సొలొమోను పట్టాభిషేకం మొదలుకొని క్రీ. పూ. 586 సం॥ బబులోను రాజైన నెబుద్నెజరు యెరూషలేమును నాశనం చేసినప్పటి వరకు జరిగిన వర్తాంతాలు ఈ గ్రంథాలలో వ్రాయబడ్డాయి.

**3. ఉద్దేశము :** రాజుల గ్రంథాలు సమూయేలు గ్రంథంలో ఆరంభించబడిన చరిత్రకు కొనసాగింపుగా ఉన్నాయి. ఇశ్రాయేలు రాజ్యాన్ని ఏలిన రాజుల చరిత్ర వీటిలో ఉంది. వారిలో, దేవుని దృష్టిలో యథార్ధవంతులుగా జీవించి వర్ధిల్లిన రాజులు ఉన్నారు. దుర్మార్గులుగా దేవునికి దూరంగా జీవించి పతనమైన రాజులు ఉన్నారు. యథార్ధవంతులు అధికారంలో ఉన్నప్పుడు దేశం వర్ధిల్లింది. దుర్మార్గుల పాలనలో దేశం పాడైపోయింది. ఈ గ్రంథాలు, తనను తాను మరియు ప్రపంచాన్ని ఏలుకోలేని మానవుని అసమర్ధతను చూపిస్తాయి. ఈ చరిత్ర పుస్తకాలలో ఇశ్రాయేలు రాజ్యం, ఉద్భవం మరియు పతనాన్ని చూస్తాము.

**4. ముఖ్యసందేశం :** దేవుని చేత ఏర్పాటు చేయబడిన ప్రజలు పాపం చేసినప్పుడు దేవుడు వారిని గద్దించక తప్పదు. అయితే దేవుడు వారిని ఎల్లప్పుడు విడిచిపెట్టడు అనేందుకు ఈ గ్రంథాలు సాదృశ్యంగా ఉన్నాయి.

**5. గ్రంథ విశిష్ఠత :**

అ) దేవుడు ఎవరిపట్లనేగాని పక్షపాతికాడని ఈ గ్రంథాలు నిరూపిస్తున్నాయి. (అపొ 10:34).

ఆ) మానవ పాలన వైఫల్యతను చూపిస్తూ, యేసుక్రీస్తు మన రాజు అనే సత్యాన్ని బోధిస్తున్నాయి.

ఇ) ఈ గ్రంథాలు దావీదు రాజుతో ఆరంభించబడి బబులోను రాజుతో ముగించబడ్డాయి.

ఈ) ఈ గ్రంథాలు మందిర నిర్మాణంతో ఆరంభించబడి, మందిర నిర్మూలనతో ముగించబడ్డాయి.

ఉ) దావీదు మొదటి వారసుడైన సొలొమోనుతో ఆరంభించబడి చివరి వారసుడైన యెహోయాకీను తో ముగించబడ్డాయి.

## B. గ్రంథ విభజన : (I రాజులు మరియు II రాజులు)

| | |
|---|---|
| **I. దావీదు మరణం** | I రాజు 1,2, అధ్యా |
| **II. సొలొమోను పాలన యొక్క మహిమ (3-11 అధ్యా)** | |
| 1. జ్ఞానము కొరకు సొలొమోను ప్రార్థన | 3,4 అధ్యా |
| 2. మందిర నిర్మాణం | 5-8 అధ్యా |
| 3. సొలొమోను ఖ్యాతి | 9,10 అధ్యా |
| 4. సొలొమోను మరణం | 11 అధ్యా |

III. **రాజ్య విభజన, (I రాజు 12 అధ్యా** II **రాజులు 16 అధ్యా)**

IV. **ఇశ్రాయేలు అష్షూరుచే చెరపట్టబడుట** II **రాజు 17 అధ్యా**

V. **యూదా బబులోనుచే చెరపట్టబడుట.** II **రాజు 18-25 అధ్యా**

## C. అంశాల వారిగా సంక్షిప్త వివరణ :

### I. ఐక్యరాజ్యం - సొలొమోను మహిమాన్విత పరిపాలన (I రాజు 1-10) :

అ) **సొలొమోను పట్టాభిషేకం (1:1-2:46) :** ఈ గ్రంథం ఆరంభంలో దావీదు వృద్ధుడైనట్లు వ్రాయబడింది. అంటే అప్పటికి అతని వయస్సు 70 సం॥లు మాత్రమే. అప్పుడు సొలొమోనుకు 19 సం॥లు. దావీదు దైవభక్తిగలవాడైనప్పటికిని బిడ్డలను పెంచే విషయంలో అంతగా శ్రద్ధ వహించలేదు. కనుక వారే అతనిపై తిరుగుబాటు చేయనారంభించారు. అతని జేష్ఠ కుమారుడైన అదోనీయా (II సమూ 3,4) సింహాసనాన్ని ఆక్రమించుకోవాలని చేసిన ప్రయత్నాన్ని బెత్షెబ మరియు నాతాను ప్రవక్త ద్వారా తెలిసికొన్న దావీదు, దేవునిచే ఎన్నుకోబడిన సొలొమోనును రాజుగా అభిషేకించాడు. (I ది.వృ 22:9 / రాజు 2:15).

ఆ) **సొలొమోను పురోగతి :** సొలొమోను ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన రాజు కావడానికి ప్రథమ కారణం అతనికి దేవునిచే ఇవ్వబడిన జ్ఞానం. దేవుడు స్వయంగా అతణ్ణి ఏమికావాలో కోరుకోమన్నాడు. అతడు జ్ఞానాన్ని కోరుకున్నాడు (I రాజు 3:7-9) ఈ కోరికలో రెండు విషయాలున్నాయి. ఇశ్రాయేలీయులు దేవుని ప్రజలని, వారికి దేవుడే అసలైన రాజని మరియు వారిని పరిపాలించేందుకు తన జ్ఞానం చాలదని సొలొమోను గ్రహించాడు. అతని జ్ఞానానికి కలిగిన ప్రథమ పరీక్షలో అతడు సఫలీకృతుడయ్యాడు. (3:16-28). ఇలా అతని జ్ఞానం గూర్చి ప్రపంచం నలుమూలలా ప్రాకిపోయింది. అతడు 3000 సామెతలను, 1005 కీర్తనలను వ్రాసాడు (4:32-34). కీర్తనల గ్రంథంలోని కొన్ని కీర్తనలను, సామెతలు, ప్రసంగి మరియు పరమ గీతాలు మొదలైన గ్రంథాలను కూడ అతడే వ్రాసాడు.



ఇ) **దేవుని మందిర నిర్మాణం :** దావీదు దేవుని మందిరం విషయం ప్రణాళిక వేసాడు. అయినా అతడు దాన్ని నిర్మించేందుకు అనుమతించబడలేదు. సొలొమోనుకు ఆపని అప్పగించబడింది. ఇశ్రాయేలీయులు ఐగుప్తునుండి బయలు దేరి వచ్చిన తరువాత 480 సంవత్సరాలకు ఈ మందిర నిర్మాణం ఆరంభమైంది. ఈ మందిరం దేవుని ఘనత కొరకు నిర్మించబడింది (I రాజు 5:5) ఎంతో వైభవంగా కనిపిస్తున్న ఈ మందిర నిర్మాణము కంటె దేవుని న్యాయవిధులను అనుసరించడం ముఖ్యమని I రాజులు 6:11-13 లో హెచ్చరించబడడం గమనార్హం. ఇది సీనాయి అరణ్యంలో మోషే నిర్మించిన ప్రత్యక్షగుడారంలాగ 3 భాగాలుగా నిర్మించబడింది. I రాజులు 6-8 అధ్యాయాలు, II దినవృత్తాంతములు 2-5 అధ్యాయాలను గమనించి చదివితే ఈ మందిరం అనేక నిపుణుల ఆధ్వర్యంలో కొన్నివేల మంది పనివారితో 7 సంవత్సరాలు నిర్మించబడినట్లు అర్థమౌతుంది.

ఈ మందిరం చారిత్రాత్మక స్థలంలో అనగా, అబ్రాహాము ఇస్సాకును బలిగా అర్పించేందుకు సిద్ధపడిన, మోరియా పర్వతంపై (ఆది 22:2) నిర్మించబడడం గమనార్హం. మందిరానికి కావల్సిన వస్తువులన్నీ ముందుగానే చెక్కి సిద్ధం చేయబడినందువలన నిర్మాణ సమయంలో సుత్తి, గొడ్డలి వంటి పరికరాల శబ్దం ఏమాత్రం వినిపించలేదు (I రాజు 6:7). ఈనాడు ఆత్మసంబంధమైన మందిరాన్ని కూడ మనం ఆలాగే నిర్మించాలి. ఏలాంటి అలికిడిగాని, అల్లరిగాని వినిపించకూడదు. దేవుని నిబంధన మందసాన్ని మందిరంలో ప్రతిష్ఠించిన తరువాత మందిరాన్ని మేఘము కప్పింది. యెహోవా తేజో మహిమ మందిరములో నిండుకొన్నది. ఆ సమయంలో సొలొమోను చేసిన ప్రార్థన గంభీరమైనది (I రాజు 8:10, 23-53) ఇశ్రాయేలు సమాజమంతా 14 రోజులు దేవుని సన్నిధిలో ఉత్సవం జరుపుకున్నారు. (I రాజు 8:65).

ఆ స్థలమే నేడు డోమ్ ఆఫ్ ద రాక్ అని పిలువబడుతున్నది. అది ప్రస్తుతం మహమ్మదీయుల ఆధీనంలో ఉంది. ఈ పవిత్ర స్థలంలో ఏ యూదుడేగాని అడుగుపెట్టేందుకు వీల్లేదు. గనుక దాని ప్రాకారం వద్ద చేరి (వెయ్‌లింగ్ వాల్) దేవుని కృప కొరకు శత్రువు నుండి విడుదల కొరకు ప్రార్థన చేస్తూ ఉంటారు.

బైబిలులో మూడు మందిర నిర్మాణాలను గూర్చి వ్రాయబడింది. వీటిని సొలొమోను, జెరుబ్బాబెలు (ఎజ్రా 522, 6:15-18) మరియు హేరోదు నిర్మించారు. ఇవన్నీ భూసంబంధమైన కట్టడలు కాని ఓ అద్భుతకరమైన సత్యమేమంటే యేసుక్రీస్తును విశ్వసించిన వారి దేహాలే ఆయనకు పవిత్రమైన ఆలయాలు (I కొరి 3:16; 16:19) ఆయన మనలో నివసిస్తూ ఉండగా మన శరీరాల్ని పవిత్రంగా కాపాడుకోవలసిన బాధ్యత ప్రతి విశ్వాసిపై ఉంది.

ఈ) **సొలొమోను అధోగతి (9:1-11:43) :** సొలొమోను పతనానికి కారణాలను I రాజు 9:1-28; 10:14-29 లో చూడగలం. అతనికున్న ఉన్నత స్థానం, గొప్ప జ్ఞానం విస్తారమైన

సంపదలు చూస్తే దేవుణ్ణి మరచిపోవడం అంత కష్టమేమి కాదు. ఒక వ్యక్తి తన సంపదలను గూర్చే ఆలోచించడం ప్రారంభించినప్పుడే అతని పతనం ప్రారంభమౌతుందన్నది వాస్తవం. అతడు అనుభవించిన భోగభాగ్యాలను గూర్చి ప్రసంగి గ్రంథంలో వివరించబడింది. ఈ పరిస్థితి ఆనాడే కాదు నేటి క్రైస్తవుల్లో కూడ స్పష్టంగా కనిపిస్తుంది. దేవుని కంటె సుఖానుభవమును ఎక్కువగా ప్రేమించేవారు అంత్యదినాల్లో మరి ఎక్కువౌతారు. (II తిమో 3:5) సొలొమోను ఆత్మీయ క్షీణతను బట్టి దేవుడు అతనిపైకి శత్రువులను రేపాడు. దేవుడు ముందుగా హెచ్చరించినప్పటికీ, సొలొమోను అదే తప్పులను చేయడం శోచనీయం (I రాజు 11:4,5). దేవునికి దూరమైన సొలొమోనుపై దేవుడు తన తీర్పును ప్రకటించాడు. (I రాజు 11:9-11).

**II. రాజ్య విభజన (12-16 అధ్యా) :** సౌలు, దావీదు, సొలొమోను ఈ ముగ్గురు కూడ ఒక్కొక్కరు 40 సంవత్సరాలు పరిపాలించడం గమనార్హం (అపొ 13:21; I సమా 5:4; I రాజు 11:42). సొలొమోను సంపదలలో, అధికారంలో ప్రమాదాలున్నాయి. అతని పరిపాలనలో ప్రజలపై పన్నుల భారం పెంచబడింది. సుఖవంతమైన జీవితం, విగ్రహారాధన, నైతికత్వాన్ని తొలగించివేసాయి. వారిపై మోపబడిన భారం వారికి విశ్రాంతి లేకుండచేసింది. తిరుబాటు చేసాలా ప్రేరేపించింది.

ఐక్యరాజ్య విభజనకు కారణాలను గమనిద్దాం. ఉత్తర ఇశ్రాయేలుకు, మరియు దక్షిణ ఇశ్రాయేలుకు మధ్య 300 సం॥లుగా అసూయ, ద్వేషాలుండినవి. రాజ్యాధికారం యూదా గోత్రికుడైన దావీదుకు ఇవ్వబడినందు వల్ల, తరువాత సొలొమోను కాలంలోని కష్టాలను బట్టి ఉత్తర ప్రాంతీయుల కోపం మరింత అధికమౌతూ వచ్చింది. (I రాజు 11:26-43; 12:4).

సొలొమోనును బట్టి రాజ్యము రెండుగా విభాగించబడవలసి ఉన్నది. కాని దేవుడు దావీదునిమిత్తం దానిని సొలొమోను దినములలో జరుగనియ్యలేదు. (11:12,13) యరొబాము సొలొమోను ద్వారా పైకి తేబడినవాడు. అతడు కుట్రతో 10 ఉత్తరపు గోత్రాలను తిరుగుబాటుకై ప్రేరేపించడం అన్నది ప్రవక్తయైన అహియా మాటల నెరవేర్పుగా జరిగింది (11:29-37). దీన్ని తెలిసికొన్న సొలొమోను అతన్ని చంపడానికి ప్రయత్నించాడు. యరొబాము ఐగుప్తుకు పారిపోయి సొలొమోను మరణం వరకు అక్కడే ఉన్నాడు.

యరొబాము తిరిగి రావడం పన్ను, రాయితీ కొరకు 10 గోత్రాలను ప్రేరేపించడం, రెహబాము ఈ విషయంలో పెద్దల సలహాను త్రోసిపుచ్చి, యౌవనస్థుల ప్రభావానికిలోనై చేసిన తీర్మానాన్ని బట్టి రాజ్యం విభాగించబడ్డం అంతా దేవుని తీర్పుగా జరిగింది.

ఏ సంఘటనలేగాని యాధృచ్ఛికంగా జరుగవు. ప్రతి తిరుగుబాటుకు కారణం ఉంటుంది. ప్రేలుడు పదార్థంలా లేక, అగ్నిపర్వతంలా అది ఒక్కసారి ప్రేలవచ్చును. ఈ



తిరుగుబాటుకు మూల కారణం ఇశ్రాయేలు ఆత్మీయ భ్రష్టత్వం. అదే ఇశ్రాయేలు రాజ్య విభజనకు దారి తీసింది. దాదాపు 3000 సంవత్సరాలు ఆలాగే ఉండింది. చివరికి ముక్కలుగా విడిపోయి చెరకు వెళ్ళారు. I రాజు 17, 25 అధ్యా) అయితే శుభవార్త ఏమంటే క్రీస్తు తన మహిమలో తిరిగి వచ్చినప్పుడు విభజించిబడిన ఇశ్రాయేలు ఐక్యపర్చబడుతుంది (యెష 11:10-13; యెహె 37:15-28).

**III.యరొబాము పరిపాలన (12:25-24:20) :** యరొబాము రాజకీయంగా మాత్రమే కాక, మతపరంగా కూడ దేశాన్ని రెండుభాగాలుగా చీల్చాడు. అతడు బేతేలులో ఒకటి, దానులో మరొకటి, రెండు బంగారు దూడలను నిలిపి, ఉత్తర గోత్రాలను విగ్రహారాధనవైపు త్రిప్పాడు. దేవుడు ప్రవక్త ద్వారా హెచ్చరించి అతనికి మరో అవకాశమివ్వజూచినప్పుడు, తాత్కాలికంగా పశ్చాత్తాపడ్డాడు కాని చివరికి ఆత్మీయంగా పూర్తిగా భ్రష్టుడయ్యాడు. (13 అధ్యా).

**IV. రెహబాము పరిపాలన (14:21-31) :** రెహబాము కూడ యూదా ప్రజల్ని దేవుని భయభక్తుల్లో నడిపించలేదు. (I రాజు 14:22,23) కనుక వారు కూడ విగ్రహారాధనవైపు తిరిగారు. అతని కాలంలో దేశంలో పురుషగాముల సంఖ్య అసాధారణంగా వృద్ధి చెందింది (14:24). దేవుడు వారిని శత్రువుల చేతికి అప్పగించాడు. ఐగుప్తు రాజైన షీషకు యెరూషలేముపైకి దండెత్తి వచ్చి దానిని పట్టుకున్నాడు. సొలొమోను నిర్మించిన మందిరంలోని ఉపకరణాలను, బంగారు డాళ్ళను దోచుకున్నాడు. రెహబాము వాటికి బదులుగా ఇత్తడి డాళ్ళను చేయించాడు.

**V. యూదా రాజుల పరిపాలన (15:1-24) :** యూదారాజ్యాన్ని ఏలిన 20 మంది రాజులలో 8 మంది మాత్రమే మంచిపేరు తెచ్చుకొన్నారు. వారిలో ఐదుగురు మాత్రమే స్థిరపడ్డారు. ఆసా దేవునితో అతి సన్నిహితంగా జీవించాడు. (I రాజు 15:11-14) కాని ఉన్నత స్థలాలను పూర్తిగా తీసివేయలేదు. ఇశ్రాయేలు రాజైన బయెషా యూదా రాజ్యం పైకి వచ్చినప్పుడు, దేవుణ్ణి ఆశ్రయించకుండ, సిరియా రాజైన బెన్హదదును అర్థించాడు. అంతేకాదు దేవుని మందిరం, మరియు రాజనగరు ఖజాలోని వెండిబంగారాలను అతనికి కానుకగా ఇచ్చాడు (I రాజు 15:18,19).

అతని తరువాత రాజైన యెహోషాపాతు 25 సం॥లు పరిపాలించాడు. తరువాత అతని కుమారుడు. యెహోరాము 8 సం॥లు పరిపాలించాడు (II రాజు 8:16,24). ఇతడు ఆహాబు, యెజెబెలుల కుమార్తెయైన అతల్యాను వివాహమాడాడు. యెహోరాము కుమారుడైన అహజ్యా ఒక్క సంవత్సరమే యూదాను పరిపాలించాడు.

అహజ్యా మరణానంతరం, అతల్యా రాజ్యాధికారం కోసం తన సొంత మనుమలను

హతమార్చింది (I రాజు 11:1-6). ఆ సమయంలో ప్రధాన యాజకుడైన యెహోయాదా అతని భార్య యెహోషెబ, అహజ్యా కుమారుడైన యెవాషును అతల్యాబారి నుండి తప్పించి 7 సంవత్సరాల తరువాత సైన్యాధిపతులతో ఈ విషయాన్ని చెప్పి, యెవాషును రాజుగా అభిషేకించారు. ప్రజలు అతల్యాపై తిరుగబడి ఆమెను చంపివేసారు.

యోవాబు యూదా దేశాన్ని 40 సం॥లు పరిపాలించాడు. అతడు కొంతవరకు దేవుని భయభక్తులలో నడిచాడు, కాని ఉన్నత స్థలాలను మాత్రం కొట్టివేయలేదు. (II రాజు 12:2:3). అతని కాలంలో చేసిన ముఖ్యమైన పని శిథిలమైన దేవుని మందిరాన్ని బాగుచేయించడం. అయితే తన చివరి దినాల్లో దేవునివైపు చూడడానికి బదులు, తన ప్రాణాన్ని దక్కించుకొనేందుకు, దేవుని మందిరంలోను రాజనగరులోను ఉన్న బంగారాన్నంతా సిరియా రాజైన హజాయేలుకు కానుకగా పంపించాడు (II రాజు 12:17,18) కొన్నాళ్ళ తరువాత అతని సేవకులే అతని మీద తిరుగుబాటు చేసి అతన్ని హతమార్చాడు (II రాజు 12:20,21). యెవాషు మరణానంతరం అతని కుమారుడు అమజ్యా యూదాకు రాజయ్యాడు.

అమజ్యా దేవుని దృష్టిలో యథార్థంగా జీవించిన మంచిరాజు (II రాజు 14:1-22). ఇతని కాలంలో యూదావారికి ఇశ్రాయేలు వారికి జరిగిన యుద్ధంలో యూదావారు బహుగా నష్టపోయారు. యెరూషలేము ప్రాకారంలో కొంత భాగం కూలిపోయింది తరువాత యెరూషలేములోని ప్రజలు కుట్ర చేసి అతన్ని చంపేసారు. అతని స్థానంలో అజర్యా రాజయ్యాడు. (II రాజు 15:1-7) ఇతడు అతని తండ్రియైన అమజ్యాలాగే యెహోవా దృష్టికి నీతిగలవాడై ప్రవర్తించాడు. ఇతని మరో పేరు ఉజ్జియా. అయితే అతడు ఉన్నత స్థలాలను కొట్టివేయలేదు. ఈ రాజు గర్వాన్ని బట్టి దేవుడు కుష్ఠరోగంతో మొత్తాడు (II రాజు 15:5). అతని తదనంతరం అతని కుమారుడైన యోతాయు దేశానికి రాజయ్యాడు.

II రాజులు 15:32-16:20 వరకు యోతాము మరియు ఆహాజుల పరిపాలన గూర్చి వ్రాయబడింది. యోతాము కొంతవరకు దేవుని దృష్టిలో నీతిమంతునిగా జీవించాడు (15:34) కాని ఆహాజు దుర్మార్గునిగా జీవించాడు (16 అధ్యా).

## VI. ఇశ్రాయేలు రాజుల పరిపాలన :

1. **ఆహాబు రాజు మరియు ఏలీయా ప్రవక్త :** ఇశ్రాయేలీయులను పరిపాలించిన చెడ్డరాజు ఒమ్రీ తరువాత, అతని కుమారుడైన ఆహాబు ఇశ్రాయేలుకు రాజయ్యాడు. ఇతడు తన పూర్వీకులందరి కంటె చెడ్డవాడు (I రాజు 16:30). ఇతడు బయలు దేవతను పూజిస్తూ, దానికి బలిపీఠాలు కట్టిస్తూ ప్రజలను ఇంకా పాపంలోకి నడిపించాడు.

ఈ కాలంలోనే అకస్మాత్తుగా రంగంలోకి దిగిన ఏలీయా ప్రవక్తకు ఆహాబుకు మధ్య సంఘర్షణ జరుగుతూ వచ్చింది. ఇశ్రాయేలు పాపమును గూర్చి దేవుడు ఏలీయా ద్వారా



ఆహాబును హెచ్చరించాడు. (I రాజు 17:1). దేవుడు ఏలియా ద్వారా అద్భుతాలను జరిగించాడు. అతని మాట ప్రకారం 3½ సంవత్సరాలు దేశంలో వర్షం కురువలేదు. దేశంలో భయంకరమైన కరవు వచ్చింది. ఆ కరవులో దేవుడు ఏలియాను ఆహాబు నుండి కాపాడడమే కాకుండ, అద్భుతమైన రీతిలో పోషించాడు. (I రాజు 17:2-4; 11-16) ఏలియాను చేర్చుకొన్న అన్యురాలైన సారెపతు విధవరాలు, అద్భుతాలను చూడగలిగింది. (I రాజు 17:18-22) కాని ఇశ్రాయేలీయుడైన ఆహాబు మాత్రం దేవుణ్ణి నమ్మలేదు, పశ్చాత్తాపపడలేదు.

అంతేకాదు ఆహాబు భార్య యెజెబెలు దేవుని ప్రవక్తలనే చంపించింది. దేవుడు మరలా ఏలియాను ఆహాబు దగ్గరకు పంపించాడు. (I రాజు 18:1). ఏలియా ఒంటరిగా నిలబడి దేవుని కొరకు చూపించిన ధైర్యం ఆశ్చర్యం కలిగిస్తుంది. ఆహాబుకు ఏలీయాకు మధ్య జరిగిన సంభాషణను గమనిస్తే, (I రాజు 18:17-19) ఆహాబు ఇశ్రాయేలు శ్రమలకు కారణం తన పాపమే అని గ్రహించి ఒప్పుకోడానికి బదులు, ఏలీయాపై నేరారోపణ చేస్తున్నాడు.

కర్మెలు కొండపై ఇశ్రాయేలీయులను మరియు బయలు ప్రవక్తల్ని సమావేశపర్చాక ఏలియా వారికి చేసిన సవాలు నేటికి మానవజాతి అంతటికి వర్తిస్తుంది. "యెన్నాళ్ళమట్టుకు మీరు రెండు తలంపుల మధ్య తడబడుచుందురు. యెహోవా దేవుడైతే ఆయనను అనుసరించుడి, బయలు దేవుడైతే వాని ననుసరించుడి" (I రాజు 18:21). కర్మెలు పర్వతరపై ఏలీయా ప్రదర్శించిన ధైర్యసాహసాలు, విశ్వాస సహితమైన, క్రియాపూర్వకమైన అతని ప్రార్థన గొప్పవిజయాన్ని కలుగజేసింది. (I రాజు 18:36-40) ఇక్కడ మనం ఓ గొప్ప సత్యాన్ని గమనించాలి. మన పక్షంగా మనం చెయ్యాల్సింది చేస్తే, మనం వేచి ఉండనక్కరలేదు. దేవుడు తన కార్యాన్ని తప్పకుండా జరిగిస్తాడు.

అయితే దేవుని పక్షంగా నిలిచి, పరిస్థితులతో రాజీ పడకుండ జీవించినప్పుడు దేవుని పక్షంగా శ్రమలు కూడ పొందాల్సి ఉంటుంది (ఫిలి 1:30). ఏలీయా కర్మెలు పర్వతంపై చేసిన వీరోచిత కార్యం అతని ప్రాణాలకే ముప్పు తెచ్చింది. యెజెబెలు మరునాటికల్లా ఏలీయాను చంపాలనుకొని తీర్మానం చేసికొన్నది. ఏలీయాను. ఆక్షణంలో ప్రాణభీతి ఆవరించింది. అరణ్యంలోకి పారిపోయి బదరీ వృక్షం క్రిందకూర్చున్న ఏలీయాకు దేవదూత పరిచర్య చేయడం, అతనికి మించిన ప్రయాణం ఉందని బలపర్చి హోరేబు పర్వతానికి పంపించడం విశేషం. (I రాజు 19:6-12). ఏలియా అంతగా నిరుత్సాహపడడానికి ఒకే కారణం కనిపిస్తుంది. అతడొక్కడే దేవుని కోసం కష్టపడుతున్నట్లు అతడు భావించాడు (19:10, 14). కాని అతనిలాగే ఇంకా 7000 మంది ఉన్నారు. విశ్వాసులుగా మనం శ్రమలలో గుండా వెళ్తున్నప్పుడు ఏలీయాలాగ తలంచితే కృంగిపోతాము. కాని

విశ్వాసులందరు ఇదే అనుభవం గుండా వెళ్తున్నారన్న గ్రహింపు ఉంటే విశ్వాసంలో మరింత స్థిరపడతాము (I పేతు 5:9).

హోరేబు పర్వతము వద్ద దేవుడు చెప్పిన మాటలలో సిరియా దేశాన్ని ఎవరు పరిపాలిస్తారో, ఇశ్రాయేలులో ఎవరు రాజుగా ఉంటారో, ఏలీయా స్థానంలో ఎవరు ప్రవక్తగా ఉండాలో అన్న దేవుని నిర్ణయం కనిపిస్తుంది (19:15–17). రాజులైనా, ప్రధానులైనా, అధికారాలైనా, సింహాసనాలైనా సమస్తం ఆయన ఆజ్ఞానుసారంగానే జరగాలి. మనం నమ్మినా నమ్మకున్నా, ఈనాడు ప్రపంచంలో జరుగుతున్నది అదే. అది మనకు అర్థంకాకున్నా చివరికి దేవుని చిత్తమే సిద్ధిస్తుంది.

ఆహాబు చెడ్డరాజైనా, దేవుడు తన ప్రేమను బట్టి పశ్చాత్తాపపడేందుకు మరో అవకాశాన్ని ఇచ్చాడు. (I రాజు 20:13) కాని శత్రువుపై విజయం దొరికాక శత్రురాజుతో సంధిచేసికొన్నాడు. తిరిగి దేవుడు హెచ్చరించినా, ఆహాబు పశ్చాత్తాపపడలేదు. (I రాజు 20:42, 43). పైగా నాబోతు ద్రాక్షాతోటను స్వాధీనం చేసికొనేందుకు అతణ్ణి హత్య చేయించి దేవుని తీర్పుకు లోనయ్యాడు. ఆ పనికై అతణ్ణి ప్రోత్సహించిన యెజెబెలుకు విధించబడిన తీర్పు ఇంకా ఘోరమైనది (I రాజు 21:19–23). దేవుడు చెప్పినట్లే వారి విషయం జరిగింది. (I రాజు 22:34–38; II రాజు 9:30–37).

2. **అహజ్యా :** ఆహాబు మరణానంతరం రాజైన అతని కుమారుడు అహజ్యా 2 సంవత్సరాలు మాత్రమే పరిపాలించాడు. అతడు కూడ తన తల్లిదండ్రుల అడుగుజాడల్లో నడిచి దేవునికి కోపం పుట్టించాడు (I రాజు 22:5 II రాజు 1:18). ఇతని విషయం కూడ దేవుడు ఏలియా ద్వారా హెచ్చరించాడు. అతని తరువాత అతని తమ్ముడైన యెహోరాము ఇశ్రాయేలుకు రాజయ్యాడు.

3. **యెహోరాము మరియు ఎలీషా ప్రవక్త :** II రాజులు 2వ అధ్యాయంలో ఏలియా పరలోకానికి అగ్ని రథంలో తీసికొనిపోబడిన తరువాత, ఎలీషా ఇశ్రాయేలు చరిత్రలో ప్రధాన పాత్ర వహించాడు. ఇశ్రాయేలు రాజైన యెహోరాము, యూదా రాజైన యెహోషాపాతు, ఎదోము రాజు కలిసి మోయాబు మీదికి యుద్ధానికి వెళ్ళారు. 7 రోజుల తరువాత ఆ యుద్ధ భూమిలో నీరు దొరకనందువలన, యెహోషాపాతు సలహా మేరకు రాజులందరు ఎలీషా ద్వారా దేవుని వద్ద విచారణ చేసారు. దేవుని ఆజ్ఞ ప్రకారం ఆ లోయలో గోతులు త్రవ్వించినపుడు వారికి నీళ్ళు సమృద్ధిగా దొరికాయి.

యూదా రాజైన యెహోషాపాతు ప్రతి విషయంలో యెహోవా యొద్ద విచారణ చేయడం గమనార్హం. ఇశ్రాయేలు రాజైన ఆహాబు విషయంలో కూడ అలాంటి సలహానే ఇచ్చాడు (I రాజు 22:5). ఎలీషా చేసిన ఇతర అద్భుతాలలో ముఖ్యమైనది యెరికో పట్టణంలోని నీటిని బాగు చెయ్యడం (II రాజు 2:21). ప్రవక్త భార్య అప్పుల విషయంలో నూనె ద్వారా



అద్భుతం చెయ్యడం (4:1–7). షూనేమియురాలి కుమారుణ్ణి బ్రతికించడం (4:33) వంట కుండలోని విషాన్ని హరించడం (4:38–41), 20 రొట్టెలను ఆశీర్వదించి 100 మందికి పెట్టడం (4:42–44) నయమానును స్వస్థపర్చడం (5:14,15) మొదలైనవి.

సిరియాసైన్యం ఇశ్రాయేలు మీదికి దండెత్తి వచ్చినప్పుడు దేవుడు వారిని రక్షించిన విధానం II రాజులు 6వ అధ్యాయంలో వ్రాయబడింది. వారి విజయానికి కారణం ఎలీషా అని, ఆ సైన్యం అతణ్ణి చుట్టు ముట్టినప్పుడు ఎలీషా ప్రార్థన మేరకు దేవుడు వారికి అంధత్వం కలుగజేసాడు. వారు పట్టుకోబడ్డా ఎలీషా మాటను బట్టి యెహోరాము వారికి ఏ హాని చెయ్యకుండ త్రిప్పి పంపించేసాడు. (6:22,23) తరువాత సిరియా రాజైన బెన్హదదు షోమ్రోనును ముట్టడించడం వలన షోమ్రోనులో భయంకరమైన కరవు ఏర్పడింది. దీనికంతా ఎలీషాయే కారణం అని ఇశ్రాయేలు రాజు ఎలీషా తలను చేధించి తేవల్సిందిగా తన సేవకులకు ఆజ్ఞాపించాడు. అప్పుడు ఎలీషా షోమ్రోనులో దేవుడు చెయ్యబోయేకార్యాన్ని వివరించినా ఎవ్వరూ నమ్మలేదు (7:1,2) దేవుడు సిరియా సైన్యంలో కలవరం పుట్టించడం వారు, పారిపోవడం, ఆకలిచే చస్తున్న 4 గురు కుష్ఠురోగులు పట్టణంలోనికి వెళ్ళలేక శత్రు శిబిరంలోని వెళ్ళి అక్కడ సమృద్ధిగా ఆహారాన్ని కనుగొని రాజుకు తెలియజేయంతో ఎలీషా ప్రవక్త ద్వారా దేవుడు సెలవిచ్చిన మాట నెరవేరింది. అతని మాటను నమ్మక హేళన చేసిన రాజు అధికారి త్రొక్కిసలాటలో మరణించాడు (7:18–20). దేవుడు ఏలీయాతో హోరేబు వద్ద సెలవిచ్చిన ప్రకారం, సిరియాకు హజాయేలు, ఇశ్రాయేలుకు యోహూ రాజుగా ఏర్పరచబడ్డారు. అవి ఎలీషా కాలంలో నెరవేరాయి. (II రాజు 8,9 అధ్యా).

4. **యెహూ :** ఎలీషా శిష్యులలో ఒకని చేత అభిషేకించబడిన యెహూ తన వద్దనున్న సైన్యాన్ని కూడగట్టుకొని ఇశ్రాయేలు రాజైన యెహోరాము మీదికి వెళ్ళాడు. యెజ్రెయేలుకు చేరిన అతన్ని, ఇశ్రాయేలు రాజైన యెహోరాము మరియు యూదా రాజైన అహజ్యా ఎదుర్కొన్నారు. వారు కలిసికొన్న స్థలం నాబోతు భూభాగం (9:22). ఇశ్రాయేలు రాజు పారిపోడానికి ప్రయత్నించాడు గాని యెహూ అతణ్ణి హతమార్చాడు. యూదారాజు కూడ గాయాలతో మెగిద్దోకు పారిపోయి అక్కడ మరణించాడు (9:27) ఈ వార్త విన్న యెజెబెలు యెహూను మంచి చేసికోడానికి ప్రయత్నించింది గాని, దేవుడు ఆమెకు ప్రకటించిన తీర్పు నెరవేర్చబడింది, యెజెబెలుతో పాటు ఆహాబు 70 మంది కుమారులు కూడ చంపబడ్డారు (II రాజు 10 అధ్యా).

యెహూ, రేకాబీయుడైన యెహోనాదాబుతో కలిసి దేశమంతట బయలు విగ్రహాలను కాల్చి వేసాడు. కాని బేతెలు, దానులో ఉన్న బంగారు దూడల్ని తీసివేయలేదు. దేవుని పట్ల యెహూ చూపించిన ఆసక్తిని బట్టి, అతని కుమారులు నాల్గవ. తరం వరకు ఇశ్రాయేలు మీద రాజ్యం చేస్తారని దేవుడు ఆశీర్వదించాడు.

**5. యెహోయాహాజు :** ఇతడు ఇశ్రాయేలీయులను 15 సం॥లు ఏలాడు. ఇతడుకూడ ఇశ్రాయేలు పాపం చేయడానికి కారుకుడైన యరొబాము లాగే ప్రవర్తించినందువల్ల దేవుడు సిరియావారైన హజాయేలు, మరియు బెన్హదదు కాలాలలో ఇశ్రాయేలీయులను వారికి అప్పగించాడు. అయితే యెహోయాహాజు చేసిన మనవిని విని దేవుడు ఒక రక్షకుని ద్వారా వారిని సిరియనుల చేతి నుండి తప్పించాడు. అయినా వారు తమ పాపాలను విడువలేదు. యెహోయాహాజు దినాలలో 50 మంది రౌతులు, 10,000 మంది కాల్బలం మాత్రమే మిగిలింది. (II రాజు 13:1-9).

**6. యెహోయాషు :** యెహోయాహాజు కుమారుడైన యెహోయాషు ఇశ్రాయేలును 16 సం॥ పరిపాలించాడు. ఇతడు కూడ చెడ్డరాజే కాని దేవుడు అబ్రాహాము, ఇస్సాకు యాకోబులతో చేసిన నిబంధనను బట్టి ఇశ్రాయేలును నాశనం చేయలేదు. అతడు ఎలీషా మరణకరమైన రోగంతో ఉన్నాడని తెలిసి అతణ్ణి చూడడానికి వెళ్ళాడు. ఎన్నో అద్భుతాలు చేసిన ఎలీషాకు రోగం రావడం మనకు అర్థంగాని విషయం. ఆ సమయంలో దేవుడు ఎలీషా ద్వారా సెలవిచ్చినట్టే యెహోయాషు 3 సార్లు సిరియనులను ఓడించాడు. (13:25) ఎలీషా మరణించిన ఒక సంవత్సరం తరువాత కొందరు ఒక శవాన్ని అతని సమాధిలో ఉంచినప్పుడు అది ఎలీషా శల్యానికి తగిలి తిరిగి బ్రతికాడు (13:21) ఎలీషా దేవుని అధికారాన్ని పొందిన ప్రవక్త అని మరలా రుజువైంది.

**7. యరొబాము-II :** యెహోయాషు తరువాత రాజైన ఇతడు కూడ దేవుని దృష్టికి హేయమైన కార్యాలు చేసాడు (14:27).

15:8-31 లో ఇశ్రాయేలు రాజ్యాన్ని పరిపాలించిన 5 గురు రాజులను గూర్చి క్లుప్తంగా ప్రస్తావించబడింది. ఇశ్రాయేలు దేశంలో ఏ మాత్రం దైవభక్తి లేదని, ఒకరిపై మరొకరు కుట్రలు పన్నుతూ ఒక్కొక్క రాజు స్వల్పకాలం మాత్రమే పరిపాలించినట్లు ఈ భాగాన్ని బట్టి అర్థమౌతుంది.

## V. యూదారాజ్యం కొనసాగింపు (I రాజు 18:1-25:30) :

**1. హిజ్కియా :** యూదా దేశాన్ని పరిపాలించిన రాజులందరిలో హిజ్కియా ఉత్తముడు (18:3) అతడు దావీదులా యథార్థంగా జీవించాడు గనుక అతడు వెళ్ళిన ప్రతి చోట, దేవుడతనికి తోడుగా ఉండి విజయాన్ని ప్రసాదించాడు (18:7). ఇతని కాలంలో యూదా వారు అష్షూరీయుల చేతిలోపడకుండ ఆశ్చర్యంగా తప్పించబడ్డారు (18:13-19).

క్రీ. పూ. 722 సం॥ అష్షూరు రాజైన షల్మనేసరు షోమ్రోనును స్వాధీనం చేసికొన్నాడు. అతని తరువాత సన్హెరీబు క్రీ. పూ. 701లో యూదా దేశంపైకి వచ్చాడు. హిజ్కియా అతని బారి నుండి తప్పించుకోడానికి దేవుని మందిరంలో, రాజనగరులో మిగిలి ఉన్న బంగారాన్ని



వెండినంతా పన్నుగా పంపించాడు. అయినా అతడు యూదా రాజ్యాన్ని సొంతం చేసికొనేందుకు బెదిరిస్తూ హిజ్కియాకు ఒక ఉత్తరం పంపించి, ప్రజలందరూ వినేలా దానిని చదివి వినిపించాడు. దేవుణ్ణి సైతం దూషిస్తూ, హిజ్కియా మాటలు వినవద్దని ప్రజలను ప్రేరేపించాడు (18:33-19:11) హిజ్కియా ఆ ఉత్తరాన్ని దేవుని సన్నిధిలో పరచి ప్రార్థించాడు (19:17-19). దేవుడు యెషయా ప్రవక్త ద్వారా కబురు పంపించాడు (యెష 36-38 అధ్యా). అష్షూరు సైన్యాన్ని అదే రాత్రి మొత్తాడు. 1,80,000 మంది మరణించడంతో సన్హెరీబు తిరిగి వెళ్ళిపోయాడు. తరువాత అతని కుమారులే అతన్ని చంపేశారు.

20వ అధ్యాయంలో, హిజ్కియాకు మరణకరమైన రోగం వచ్చినప్పుడు యెషయా అతనితో దేవుడు సెలవచ్చిన మాట చెప్పగా, హిజ్కియా కన్నీరు విడిచి ప్రార్థించినప్పుడు దేవుడు అతని మొఱ ఆలకించి అతని ఆయుష్షును 15 సం॥లు పొడిగించాడు. ఆ తరువాత హిజ్కియా, శత్రువుల పొగడ్తలకు లోబడి రాజనగరులోని వస్తువులను ఆయుధశాలను, ధనాగారాన్ని చూపించాడు. దానిని బట్టి దేవుడు యెషయా ద్వారా తన తీర్పును ప్రకటించాడు (20:16-17).

**2. మనష్షే :** నీతిమంతుడైన హిజ్కియా కుమారుడు, మనష్షే చాల చెడ్డరాజు (21:1-8). తన తండ్రి పడగొట్టిన ఉన్నత స్థలాలను అతడు తిరిగి కట్టించాడు. అన్యదేవతలకు, నక్షత్రాలకు మ్రొక్కాడు. జ్యోతిష్యాన్ని శకునాలను ప్రోత్సహించాడు. దేవుని మందిరాన్ని సహితం అపవిత్ర పర్చాడు. దేశంలో నిరపరాధుల రక్తాన్ని చిందించాడు. దాంతో దేవుని ఉగ్రత యూదా దేశం మీదికి కూడ దిగిరావడం ప్రారంభమైంది (21:12-14).

**3. ఆమోను మరియు యోషీయా :** ఆమోను కూడ తన తండ్రియైన మనష్షేలాగ దేవుని దృష్టిలో పాపం చేసాడు. అతని సేవకులే అతని మీద కుట్ర చేసి అతణ్ణి చంపేసారు (21:23) అతని తరువాత రాజైన అతని కుమారుడు యోషీయా పరిపాలన గూర్చి 22,23 అధ్యాయాల్లో వివరంగా ఉంది. ఇతడు దేవుని దృష్టిలో యథార్థంగా జీవించాడు. శిధిలమైన దేవుని మందిరాన్ని బాగు చేయించాడు. ఆ సమయంలో దొరికిన ధర్మశాస్త్రాన్ని చదివి (22:8) దేవుని సన్నిధిలో తీర్మానం చేసికొని, దేవుని ధర్మశాస్త్రాన్ని పాటించాల్సిందిగా ప్రజలకు ఆజ్ఞాపించాడు. యూదా దేశంపైకి రాబోతున్న నాశనాన్ని గూర్చి హుల్దా అనే ప్రవక్త్రి ద్వారా అతనికి తెలియజేయబడింది. కాని అతని కాలంలో ఏ కీడు రానివ్వనని దేవుడు వాగ్దానం చేసాడు.

## VI. ఇశ్రాయేలు మరియు యూదా రాజ్యాల పతనం :

**1. ఇశ్రాయేలు చరిత్ర :** ఇశ్రాయేలు రాజుల చరిత్ర హోషేయ పరిపాలనతో ముగుస్తుంది. తమను ఐగుప్తు దాస్యం నుండి విడిపించిన దేవుణ్ణి, ఆయన ఇచ్చిన ధర్మశాస్త్రాన్ని వారు పూర్తిగా మర్చిపోయారు (I రాజు 7:15). దేవుడు చెయ్యవద్దని ఆజ్ఞాపించిన వాటినే చేసారు.

ఆయన తన ప్రవక్తల ద్వారా చేసిన హెచ్చరికలను తృణీకరించి దేవుని తీర్పుకు లోనయ్యారు. ఉత్తర రాజ్యమైన ఇశ్రాయేలు నామరూపాలు లేకుండా తుడుచుకుపోయింది.

2. **యూదారాజ్యం చివరి దశ (23:31-25:30) :** యోషీయ కుమారుడైన యెహోయాహాజు దేవునికి దూరంగా జీవించాడు. అతడు రాజైన 3 నెలలకే ఐగుప్తురాజైన ఫరోనెకో యెరూషలేము మీద దాడిచేసి యెహోయాహాజును పట్టుకొని, అతని తమ్ముడైన ఎల్యాకీమును రాజుగా నియమించాడు. యెహోయాహాజు జీవితకాలమంతా ఐగుప్తులో బందీగా ఉన్నాడు (II రాజు 23:33).

ఫరోనెకో ఎల్యాకీముకు యెహోయాకీము అని పేరుపెట్టాడు. ఇతడు ఐగుప్తురాజుకు ప్రతి సంవత్సరం పన్ను చెల్లిస్తూ వచ్చాడు. ఇతనికాలంలో బబులోనురాజైన నెబుకద్నెజరు యెరూషలేమును పట్టుకొన్నాడు. 3 సంవత్సరాలు అతనికి దాసునిగా ఉన్న యెహోయాకీము, అతనిపై తిరుగుబాటు చేయగా నెబుకద్నెజరు మరోసారి దండెత్తి వచ్చి యూదా దేశంలో చాలా భాగాన్ని ఆక్రమించుకున్నాడు. మంచి వస్తువులన్నీ దోచుకొని వెళ్ళాడు. అనేక మంది యౌవనస్తుల్ని బంధీలుగా పట్టుకొనిపోయాడు (దాని 1:1-7).

యెహోయాకీము మరణానంతరం రాజైన అతని కుమారుడు యెహోయాకీను తన చెడునడతను బట్టి దేవుని కోపానికి గురయ్యాడు. నెబుకద్నెజరు మరోసారి యెరూషలేము మీదికి దండెత్తి యెహోయాకీనును అతని తల్లిని, అతని సేవకుల్ని అనేక యౌవనస్తుల్ని బంధీలుగా తీసికొని వెళ్ళాడు (24:13-15) వారిలో యెహెజ్కేలు కూడ ఉన్నాడు. (యెహె 1:22).

ఈ విధంగా నెబుకద్నెజరు యూదా దేశాన్ని దోచుకొని యెహోయాకీను పినతండ్రియైన మత్తన్యాకు, సిద్కియా అనే పేరు పెట్టి, పతనావస్థలో ఉన్న యూదా దేశానికి రాజుగా నియమించాడు. సిద్కియా 11 సంవత్సరాలు పరిపాలించాక నెబుకద్నెజరుపై తిరుగుబద్దాడు. దాంతో చివరిగా క్రీ. పూ. 586లో నెబుకద్నెజరు యూదా దేశాన్ని సర్వనాశనం చేసి సిద్కియా కుమారులను చంపించి, సిద్కియా కళ్ళు పెరికించి బందీగా తీసికొని వెళ్ళాడు. ఆ విధంగా యూదా ప్రజలు బబులోనుకు చెరగొనిపోబడ్డారు. యూదాలో మిగిలి ఉన్న కొద్ది మంది మీద గెదల్యా అధిపతిగా నియమించబడ్డాడు కాని 7 నెలల తరువాత ఇష్మాయేలు గెదల్యాను చంపడంతో మిగిలిన ఆ కొద్ది శేషం ఐగుప్తు దేశానికి పారిపోయారు. దేవుణ్ణి విడిచిపెట్టిన వారి పతనాన్ని రాజుల గ్రంథం కళ్ళకు కట్టినట్లు చూపిస్తుంది.



# గొప్ప సమాచారం

## (I & II దినవృత్తాంతముల గ్రంథాల సంగ్రహ సమీక్ష)

**A. ఉపోద్ఘాతము :** ఇశ్రాయేలు చరిత్రను మరింత వివరంగా చెప్పే గ్రంథాలు దిన వృత్తాంతాలు. దేవుడు తన గొప్ప సంకల్పాలను, వాగ్దానాలను నెరవేర్చేందుకు, ఆయన ఏర్పరచుకొన్న యూదాజాతి చరిత్రను అర్థం చేసికోవడానికి సమూయేలు మరియు రాజుల గ్రంథాలతో పాటు దినవృత్తాంతాలను కూడ తప్పకుండ చదవాలి. సమూయేలు మరియు రాజుల గ్రంథాలలో పునరావృతం చేయబడని అంశాలను మాత్రమే ఈ సంగ్రహ సమీక్షలో పొందుపర్చాము.

1. **గ్రంథకర్త :** యూదుల సాంప్రదాయం ప్రకారం, ఈ గ్రంథాల్ని ఎజ్రా వ్రాసాడని తెలుస్తుంది. క్రీ. పూ. 1101-506 మధ్యకాలంలో వ్రాయబడిన గ్రంథాలలోని సమాచారాన్ని సేకరించి క్రీ. పూ. 550 తరువాత ఎజ్రా ఈ గ్రంథాన్ని సంకలనం చేసి ఉండవచ్చునని చరిత్ర కారుల అభిప్రాయం, మూల భాషలో ఇది ఒకే గ్రంథంగా ఉండినది కాని తరువాత రెండు భాగాలుగా విభజించబడింది.

2. **ఉద్దేశము :** క్రీ. పూ 538లో కోరెషు ఆజ్ఞ ప్రకారం యెరూషలేముకు తిరిగివచ్చిన వారికి ఇశ్రాయేలు ప్రజల గత చరిత్రను, దేవుని మందిర ప్రాముఖ్యతను వివరించేందుకు ఈ గ్రంథాలు వ్రాయబడ్డాయి.

**B. గ్రంథ విభజన : (I దినవృత్తాంతములు)**

| | |
|---|---|
| I. వంశావళులు | 1-9 అధ్యా |
| II. సౌలు పరిపాలన | 10 అధ్యా |
| III. దావీదు పరిపాలన (11-29 అధ్యా) | |
| 1. దావీదుకున్న శక్తివంతులైన యోధులు | 11,12 అధ్యా |
| 2. దావీదు మరియు దేవుని మందసము | 13-16 అధ్యా |
| 3. దావీదు మరియు మందిరము | 17 అధ్యా |
| 4. దావీదు యుద్ధాలు | 18-20 అధ్యా |
| 5. జన సంఖ్య విషయంలో దావీదు పాపం | 21 అధ్యా |
| 6. మందిర నిర్మాణం కొరకు దావీదు సిద్ధపాటు | 22-29 అధ్యా |

**ఆ. II దినవృత్తాంతములు :**

| | |
|---|---|
| 1. సొలొమోను పరిపాలన 1-9 అధ్యా | |
| 2. రాజ్య విభజన మరియు యూదా చరిత్ర | 10-36 అధ్యా |
| - ఆసా పరిపాలన | 14-16 అధ్యా |

- యెహోషాపాతు పరిపాలన 17-20 అధ్యా
- యోవాషు పరిపాలన 23, 24 అధ్యా
- హిజ్కియా పరిపాలన 29-32 అధ్యా
- యోషీయా పరిపాలన 34, 35 అధ్యా

## C. అంశాల వారిగా సంక్షిప్త వివరణ :

చాల మంది, దినవృంతాల గ్రంథాల అంశాలు రాజుల గ్రంథాల నుండి తీసికోబడ్డాయని తలుస్తారు. దినవృంతాలు రాజులగ్రంథానికి నకలు కాపీనా? వాస్తవంగా గ్రీకు భాషలో తర్జుమా చేసిన వారు, దినవృత్తాంతాల గ్రంథానికి "వదిలి వేసిన అంశాలు" అనే శీర్షికనిచ్చారు. ఈ గ్రంథాలలోని పలు విషయాలు రాజుల గ్రంథాలలో లేవు I దిన వృత్తాంతాల్లో, దావీదు ప్రాముఖ్యమైన అంశం. II దినవృత్తాంతములలో, దావీదు ఇల్లు ప్రధానాంశం. ఇందులో దావీదు పాపాన్ని గూర్చిన ప్రస్తావన లేదు. దేవుడు దాన్ని క్షమించాడు. ఇశ్రాయేలు జాతి చరిత్ర, రాజుల గ్రంథంలో సింహాసనం ద్వారా, దినవృంతాల గ్రంథంలో బలిపీఠం ద్వారా వివరించబడింది. రాజుల గ్రంథం రాజకీయ చరిత్రను వివరిస్తుంది. దిన వృత్తాంతాలు మతపరమైన చరిత్రను వివరిస్తాయి. రాజుల గ్రంథం మానవ దృక్పథాన్ని, దినవృత్తాంతాలు దైవిక దృక్పథాన్ని తెలియజేస్తాయి. సమూయేలు మరియు రాజుల గ్రంథాలలోని 451 సంవత్సరాల చరిత్ర అంతా దినవృంత్తాల గ్రంథాలలో మరో కోణం నుండి చూపించబడింది. కాబట్టి ఈ మూడు గ్రంథాలను కలిపి చదివితే ఇశ్రాయేలు చరిత్ర అంతా అర్థం అవుతుంది.

**అ) వంశావళులు :**

1. **దావీదు వంశక్రమం :** I దిన వృత్తాంతాలు మొదటి అధ్యాయంలో ఆదాము నుండి ఇశ్రాయేలు వరకు, 2-4 అధ్యాయాలలో యూదా గోత్రం, అతని నుండి వచ్చిన దావీదు మరియు సొలొమోనుల వంశావళి ఉంది. దేవుని చేత ఏర్పరచుకోబడ్డ యూదా గోత్రపు ప్రత్యేకతను ఎత్తి చూపించడమే ఈ మొదటి 4 అధ్యాయాల ముఖ్యోద్దేశం.
2. 5వ అధ్యాయంలో రూబేను వంశావళి వ్రాయబడింది. ఇతడు తన జన్మ హక్కును పోగొట్టుకొన్నాడు. అది యోసేపుకు ఇవ్వబడింది. కాని వంశావళిలో యూదాకు ప్రథమ స్థానం ఇవ్వబడింది. గాదు వంశావళి, యూదా రాజైన యోతాము పాలనవరకు మరియు ఉత్తర రాజ్యం చెరకు వెళ్ళేంత వరకు ఇవ్వబడింది. చెరకు కారణాలు 25, 26 వచనాల్లో ఉన్నాయి.
3. ప్రధాన యాజకుల కుటుంబమైన లేవీ వంశం అతని కుమారులైన గెర్షోను, కహాతు, మెరారీల ద్వారా, 6వ అధ్యాయంలో పేర్కొనబడింది. వారి విధులు 49వ వచనంలో వ్రాయబడ్డాయి.



4. 7వ అధ్యాయంలో ఇశ్శాఖారు, బెన్యామీను, నఫ్తాలి, మనష్షే, ఎఫ్రాయిము మరియు ఆషేరు గోత్రాల వంశావళులున్నాయి. వీరందరూ అష్షూరు చెరకు వెళ్ళినవారు. 8వ అధ్యాయంలో సౌలు మరియు యోనాతానులను గూర్చి వివరిస్తూ బెన్యామీను గోత్ర వివరాలివ్వబడ్డాయి.

**ఆ) దావీదు కాలంలో ఉజ్జీవం :** ఒక్క అధ్యాయంలోనే, అనగా I దినవృత్తాంతాలు 10వ అధ్యాయంలో సౌలును గూర్చి వ్రాయబడింది. కాని దావీదును గూర్చి మిగతా అధ్యాయాలన్నీ వ్రాయబడ్డాయి. దావీదు దేవుని హృదయానుసారుడు మాత్రమే కాదు కాని, ఈ లోకానికి రాబోయే మెస్సీయా ఇతని వంశక్రమం నుండే వస్తాడు గనుక అంత ప్రాముఖ్యత ఇవ్వబడింది.

సౌలు కాలంలో దేవునికి దూరమైపోయిన ఇశ్రాయేలు ప్రజల్ని, దావీదు ఏవిధంగా ఉజ్జీవింపజేసాడో 11-16 అధ్యాయాల్లో చూస్తాం. దావీదు రాజవడం, కేవలం దేవుని కృప. దావీదు దేవునికి లోబడే కొద్దీ దేవుడు అతన్ని హెచ్చించాడు. సౌలు కాలంలో దేవుని నిబంధనను మర్చిపోయిన ప్రజల మధ్యకు, తిరిగి దేవుని నిబంధన మందసాన్ని తీసికొని వచ్చి దాని ప్రాముఖ్యతను బోధించాడు (13-16 అధ్యా).

**ఇ) దావీదు-దేవుని మందిరం :** దేవుని మందిరాన్ని కట్టాలన్న ప్రగాఢమైన కోరిక దావీదుకు ఉన్నప్పటికిని అందుకు అతడు అనుమతించబడలేదు. సొలొమోను మందిరాన్ని నిర్మించినా, అది దావీదు మందిరంగానే పిలువబడింది. దావీదు బ్రతికి ఉండగానే సొలొమోను కట్టబోయే మందిరం కొరకు అన్ని ఏర్పాట్లు చేసాడు. మందిరపు పని నిమిత్తం లేవీయులను, మరియు గాయక బృందాన్ని ఏర్పాటు చేసాడు (23, 25 అధ్యా) 4000 మంది వాయిద్యకారులు గల ఈ గాయక బృందానికి ఆసాపు, యెదూతూను, హేమాను నాయకులు. 26వ అధ్యాయంలో మందిర ద్వారపాలకులను గూర్చి. కానుక పెట్టె కాపలాదారులను గూర్చి, 27వ అధ్యాయంలో 12 గోత్రాలనుండి నియమింపబడిన పెద్దల వివరాలున్నాయి. 28, 29 అధ్యాయాలు దావీదు మందిర నిర్మాణం నిమిత్తం ప్రజల్ని ప్రోత్సహించిన విధానం, దేవుని మందిరం పట్ల అతనికున్న, భారం, అపేక్ష, ఆకాంక్షను తెలియజేస్తున్నాయి. (28:2,3, 11-13, 29:2,3) 29:10-19లో దావీదు చేసిన ప్రార్థనలో, ప్రభువు ప్రార్థనలోని అంశాలున్నాయి. దావీదు మరణం మరియు సొలొమోను సింహాసనాన్ని అధిష్టించుటతో I దినవృత్తాంతాల గ్రంథం ముగుస్తుంది.

**ఈ) సొలొమోను-దేవుని మందిరం :** I రాజుల గ్రంథంలోని సొలొమోను చరిత్రలోని కొన్ని విషయాలు II ది.వృ. గ్రంథంలో ఉదహరించబడలేదు. చెర నుండి వచ్చినవారికి మందిర ప్రాముఖ్యతను తెలియజేయడమే ఈ గ్రంథ ఉద్దేశం. 70,000 మంది బరువులు మోసేవారు, 80,000 మంది మ్రానులు నరికేవారు, 3,600 మంది పనివారిపై అధికారులు, ఇలా వేలాది పనివారితో 7 సంవత్సరాలు శ్రమించాక మందిర నిర్మాణం పూర్తయింది. మందిరమంతా బంగారంతో పొదిగించబడింది. ఈ సందర్భంగా దేవుడు ప్రత్యక్షమై సెలవిచ్చిన మాటల్లో, II ది.వృ. 7:14 లోని మాట ప్రతి విశ్వాసిని, సవాలు చేస్తుంది.

గురుతర బాధ్యతను జ్ఞాపకం చేస్తుంది. నెబుకద్నెజరు చేతిలో మందిరం పతనమయ్యేంత వరకు అనగా క్రీ. పూ. 959 నుండి 586వ సంవత్సరం వరకు నిలిచి ఉంది.

ఉ. **దేవుని మందిర పతనం :** II ది.వృ. 11, 12 అధ్యాయాలలో సొలొమోను కుమారుడైన రెహబాము పరిపాలను గూర్చి వ్రాయబడింది. ఇతని కాలంలో ఉత్తర ఇశ్రాయేలు రాజ్యంలో అనేక ఇబ్బందులకు గురైన లేవీయులనేకులు యూదా దేశానికి తరలి వచ్చారు. (11:14) రెహబాము కుమారుడైన అబీయా కాలంలో యూదావారికి ఇశ్రాయేలువారికి జరిగిన అంతర్యుద్ధంలో, 5,00,000 మంది ఇశ్రాయేలీయులు మరణించారు (13:17) అలా యూదా రాజ్యం అంతకంతకు బలం పుంజుకుంది.

II ది.వృ. 14-36 అధ్యాయం వరకు చోట చేసికొన్న 5 ఉజ్జీవాలను గమనిద్దాం.

1. ఆసా కాలంలో - 5:8,9.
2. యెహోషాపాతుకాలంలో - 17:3,4
3. యోవాషుకాలంలో - 23:16-21; 24:1-6.
4. హిజ్కియాకాలంలో - 29:3-36; 30:1,15,16.
5. యోషియాకాలంలో - 34:18-21.

వీరి పరిపాలనలో యూదా ప్రజలు ఆధ్యాత్మికంగా ఎంతో ఉజ్జీవింపబడ్డారు. దేవుని కార్యాల పట్ల ఈ రాజులకున్న ఆసక్తి, తీవ్రత ఆమోఘం ప్రసంశనీయం. (14:2-5, 17:9; 19:4; 20:12,13,15; 29:2-5,16,20-30; 30:24-27; 34:27-28).

యోషీయా తరువాత యూదా దేశాన్ని పాలించిన నలుగురు రాజులు దేవుని దృష్టిలో పాపంచేసారు. వారిలో యెహోయాకీము అనే మారుపేరు పెట్టబడిన ఎల్యాకీము, యెహోయాకీను, సిద్కియా అనే ముగ్గురు రాజుల కాలంలో బబులోను రాజైన నెబుకద్నెజరు యెరూషలేముపై 3 సార్లు దాడిచేసి యూదారాజ్యాన్ని సర్వనాశనం చేసాడు. దేవుని మందిరంలోని బంగారాన్ని ఉపకరణాలన్ని దోచుకుని యూదా వారిని బబులోనుకు బంధీలుగా తీసికొనివెళ్ళాడు (36:18-20).

II ది.వృ. 36:21లో, యిర్మీయా ప్రవచనం, ప్రకారం, 70 సంll ల చెరకు కారణం ఏంటో వివరించబడింది ఈ 70 సంవత్సరాల తరువాత పర్షియా రాజైన కోరేషు యూదులు తిరిగి యెరూషలేముకు వెళ్ళి దేవుని మందిరాన్ని కట్టాల్సిందిగా ఆజ్ఞనివ్వడం (36:22,30) యూదులు తిరిగి రావడం జరిగింది. దీంతో ఇశ్రాయేలు చరిత్ర మరో మలుపు తిరిగింది. ఏది ఏమైనా దేవుడు ఇశ్రాయేలు జాతిని విడిచిపెట్టలేదు. ఆజాతి నుండి లోక రక్షకుడైన యేసు క్రీస్తును ఈ లోకానికి పంపించే ప్రణాళికను, తన నిత్య సంకల్పాన్ని విరమించుకోలేదు. అందును బట్టే ఈనాడు మనం ఆ రక్షణకు పాత్రులమయ్యాం. ఆయనను లోకానికి అందించుటలో, దేవుని హస్తాల్లో వాడుకోబడిన ఆయన వరుసకు చెందిన రాజులందరిని బట్టి మనం దేవునికి కృతజ్ఞులమై యుండాలి. ప్రభువు మిమ్మును దీవించుగాక!



## ఐక్యరాజ్య విభజన అనంతరం ఏలిన ఇశ్రాయేలు మరియు యూదా రాజుల పట్టిక

| | యూదా | | ఇశ్రాయేలు | | |
|---|---|---|---|---|---|
| రాజు | పరిపాలనకాలం | ప్రవక్త | రాజు | పరిపాలనకాలం | ప్రవక్త |
| 1. రెహబాము | క్రీ.పూ.931-913 (17 సంll) | షెమయా | 1. యరోబాము | క్రీ.పూ.931-910 (22 సంll) | అబీయా |
| 2. అబీయా | క్రీ.పూ.913-911 (3 సంll) | | 2. నాదాబు | క్రీ.పూ.910-909 (2 సంll) | |
| 3. ఆసా | క్రీ.పూ.911-870 (3 సంll) | | 3. బయెషా | క్రీ.పూ. 909-886 (24 సంll) | |
| 4. యెహోషాపాతు | క్రీ.పూ.870-848 (25 సంll) | | 4. ఏలా | క్రీ.పూ.886-885 (2 సంll) | |
| 5. యెహోరాము | క్రీ.పూ.848-841 (8 సంll) | | 5. జిమ్రీ | క్రీ.పూ.885 (7 రోజులు) | |
| 6. అహజ్యా | క్రీ.పూ.841 (1 సంll) | | 6. ఒమ్రీ | క్రీ.పూ.885-874 (12 సంll) | |
| 7. అతల్యా | క్రీ.పూ.841-835 (6 సంll) | | 7. ఆహాబు | క్రీ.పూ.874-853 (22 సంll) | ఏలియా మీకాయా |
| 8. యోవాషు | క్రీ.పూ.835-796 (40 సంll) | యోవేలు | 8. అహజ్యా | క్రీ.పూ.853-852 (2 సంll) | |
| 9. అమజ్యా | క్రీ.పూ.796-767 (29 సంll) | | 9. యెహోరాము | క్రీ.పూ.852-841 (12 సంll) | ఎలీషా |
| 10. అజర్యా (ఉజ్జీయా) | క్రీ.పూ.767-740 (52 సంll) | యెషయా | 10. యెహూ | క్రీ.పూ.841-814 (28 సంll) | |
| 11. యోతాము | క్రీ.పూ.740-732 (16 సంll) | మీకా | 11. యెహోయాహోహాజు | క్రీ.పూ.814-798 (17 సంll) | |
| 12. ఆహాజు | క్రీ.పూ.732-716 (16 సంll) | | 12. యెహోయాషు | క్రీ.పూ.798-782 (16 సంll) | యోనా |
| 13. హిజ్కియా | క్రీ.పూ.716-687 (29 సంll) | | 13. యరోబాము II | క్రీ.పూ.782-753 (41 సంll) | ఆమోసు హోషెయా |
| 14. మనష్షే | క్రీ.పూ.687-642 (55 సంll) | నహూము | 14. జెకర్యా | క్రీ.పూ.753-752 (6 నెలలు) | |
| 15. ఆమోను | క్రీ.పూ.687-640 (2 సంll) | హబక్కూకు | 15. హల్మూము | క్రీ.పూ.752 (1 నెల) | |
| 16. మోషియా | క్రీ.పూ.640-608 (31 సంll) | జెఫన్యా | 16. మెనహేము | క్రీ.పూ.752-742 (2 సంll) | |
| 17. యెహోయాహాజు | క్రీ.పూ.608 (3 నెలలు) | యిర్మీయా | 17. పెకహ్యా | క్రీ.పూ.742-740 (2 సంll) | |
| 18. యెహోయాకీము | క్రీ.పూ.608-597 (11 సంll) | | 18. పెకహు | క్రీ.పూ.740-732 (20 సంll) | |
| 19. యెహోయాకీను | క్రీ.పూ.597 (3 సంll) | | 19. హోషెయ | క్రీ.పూ.732-721 (9 సంll) | |
| 20. సిద్కియా | క్రీ.పూ.597-583 (11 నెలలు) | | | | |